



Truth of News
RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 241 | శనివారం 21 ఫిబ్రవరి 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50
irculated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi




## ఏఐ సమ్మిట్ వద్ద కాంగ్రెస్ నిరసన...

- రాహుల్ గాంధీని టార్గెట్ చేసిన కిషన్ రెడ్డి, బండి సంజయ్
- ఏఐ సదస్సు వద్ద యూత్ కాంగ్రెస్ అర్ధనగ్న ప్రదర్శనపై దుమారం
- రాహుల్ గాంధీ దర్శకత్వంలోనే ఇదంతా జరిగిందన్న కిషన్ రెడ్డి
- ఇది యువతను, పారిశ్రామికవేత్తలను అవమానించడమేనని విమర్శ
- కాంగ్రెస్ ద్వంద్వ వైఖరిపై మండిపడ్డ కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్
- ఒకవైపు రేవంత్ ప్రశంసలు, మరోవైపు నిరసనలంటూ ఎద్దేవా

2లో

## ప్రజా ప్రయోజనకారిగా మార్చండి

### - ఏఐ, డీప్‌టెక్ స్టార్టప్‌ల సీఈఓలతో ప్రధాని సమావేశం



న్యూఢిల్లీ – సూర్య వాస్తవం

వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణ వంటి వివిధ రంగాల్లో కృత్రిమ మేధస్సు సాంకేతికతను ఉపయోగించడానికి గల అవకాశాలు, మార్గాలపై ప్రధాని నరేంద్ర మోడీ శుక్రవారం వివిధ ఏఐ, డీప్‌టెక్ స్టార్టప్‌ల సీఈఓలతో చర్చించారు. అలాగే మాతృభాషలో ఉన్నత విద్యను పెంపొందించడంతో సహా పలు అంశాలపై మాట్లాడారు. ప్రధానితో

# నాలెడ్జ్, క్రియేటర్ ఎకానమీగా ఏపీ..

- టెక్ దిగ్గజాలతో చంద్రబాబు విస్తృత చర్చలు
- ఢిల్లీ ఏఐ సమ్మిట్‌లో అడోబ్, ఆరామ్‌కో, ఎన్విడియా వంటి దిగ్గజాలతో సీఎం భేటీ
- ఏఐ లివింగ్ ల్యాబ్స్, డిజైన్ఇంజనీరింగ్ కేంద్రాల ఏర్పాటుపై కీలక చర్చలు
- టెక్ నైపుణ్యాలున్న యువశక్తి రాష్ట్రానికి అతిపెద్ద వనరని స్పష్టం చేసిన చంద్రబాబు
- పాఠశాలల్లో రోబోటిక్స్, ఏఐ ల్యాబ్స్ ఏర్పాటుకు లెగో సంస్థతో సంప్రదింపులు

న్యూఢిల్లీ – సూర్య వాస్తవం




ఆంధ్రప్రదేశ్‌ను నాలెడ్జ్, క్రియేటర్ ఎకానమీకి కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీలో కీలక చర్చలు జరిపారు. టెక్ నైపుణ్యాలున్న యువశక్తే రాష్ట్రానికి అతిపెద్ద వనరని, వారిని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్వాంటం టెక్నాలజీ వంటి భవిష్యత్ రంగాల్లో ప్రపంచస్థాయి నిపుణులుగా తీర్చి దిద్దుతామని ఆయన స్పష్టం చేశారు. ఢిల్లీలోని భారత్ మండపంలో జరుగుతున్న 'ఇండియా ఏఐ–ఇంపాక్ట్ సమ్మిట్ 2026'లో భాగంగా పలు అంతర్జాతీయ టెక్ దిగ్గజ కంపెనీల అధినేతలతో ఆయన వేర్వేరుగా సమావేశమై రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే దిశగా చర్చలు జరిపారు.

**టెక్ దిగ్గజాలతో కీలక సమావేశాలు**

ఏపీ పెవిలియన్‌లో అడోబ్ సీఈఓ శంతను నారాయణ్, ఆటోడెస్క్ ఏఐ హెడ్ మైక్ హాలే, ఆరామ్‌కో ఇండియా డైరెక్టర్ అబ్దుల్ రెహమాన్ ఐతుకైర్, లెగో ఎడ్యుకేషన్ వైస్ ప్రెసిడెంట్ టామ్ హాల్, ఆధార్ ఫౌండర్ సీటీఓ శ్రీకాంత్ నాదముని, ఖోస్లా వెంచర్స్ ఎండీ వినోద్ ఖోస్లా వంటి ప్రముఖులు ముఖ్యమంత్రితో సమా వేశమయ్యారు. ప్రముఖ టెక్నాలజీ సంస్థ అడోబ్ సీఈఓ శంతను నారాయణ్‌తో

- మిగతా 2లో..



## ఉపాధి హామీ పథకం పరిరక్షణకు అండగా నిలవాలి

- రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేసిన చంద్రబాబు, జగన్
- బిజెపిని ఎదిరించే దమ్ము ధైర్యం వైసీపీ, కూటమికి లేవు
- పేదల పక్షాన నిలిచేది కాంగ్రెస్ ఒక్కటే
- ఉపాధి హామీ పరిరక్షణ యాత్రలో పీసీసీ అధ్యక్షురాలు షర్మిల

2లో

# ఏఐ స్టార్టప్ విలేజ్ ఏర్పాటుకు సిద్ధం

- హైదరాబాద్‌లో ఏఐ వార్ రూమ్
- దేశాన్ని ప్రపంచ ఏఐ పవర్‌హౌస్‌గా నిర్మించాలి
- ఇందుకోసం ఏఐకి ప్రత్యేక మంత్రిత్వ శాఖ అవసరం
- ఢిల్లీ 'ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026'లో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్– సూర్య వాస్తవం



ప్రస్తుతం యావత్ ప్రపంచాన్ని ప్రభావితం చేస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో భారత్ ముందంజలో నిలవాలంటే కేంద్ర ప్రభుత్వంలో ప్రత్యేక ఏఐ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కృత్రిమ మేధస్సు వినియోగం, నియంత్రణ, చట్టపరమైన మార్గదర్శకాలు, జాతీయ భద్రత వంటి అంశాలను సమగ్రంగా నిర్వహించేందుకు ప్రత్యేక వ్యవస్థ అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. శుక్రవారం ఢిల్లీలో నిర్వహించిన ఏఐ సమ్మిట్‌లో ఆయన ప్రసంగించారు. మానవ చరిత్రలో అగ్ని, చక్రం, వ్యవసాయం, విద్యుత్, ఇంటర్నెట్ వంటి ఆవిష్కరణలు ప్రపంచాన్ని ఎలా మార్చాయో గుర్తు చేశారు. ఏఐ కూడా అలాంటి విప్లవాత్మక సాంకేతికతేనని, ఇది కేవలం ఇంకొక టెక్నాలజీ కాదనీ, మానవ పరిణామ క్రమంలో అత్యంత శక్తివంతమైన మలుపని అభివర్ణించారు.

మునుపటి యంత్రాల మాదిరిగా కాకుండా ఏఐ స్వయంగా నేర్చుకోగలదనీ, విశ్లేషించగలదనీ, నిర్ణయాలు తీసుకోగలదని పేర్కొన్నారు. రోబోటిక్స్‌తో కలిసినప్పుడు యంత్రాలు మానసిక మేధస్సుతో పాటు శారీరక సామర్థ్యాన్ని కూడా పొందుతున్నాయని అన్నారు. ప్రపంచంలో ఏఐ పోటీ ఇప్పటికే ప్రారంభమైందనీ, కొన్ని దేశాలు, కంపెనీలు ముందంజలో ఉన్నాయని సీఎం చెప్పారు. గత పారిశ్రామిక విప్లవాల సమయంలో జరిగిన అవకాశ నష్టాలను గుర్తు చేస్తూ, ఈసారి భారత్ అలాంటి తప్పిదం చేయకూడదని హెచ్చరించారు. సేవలు, సాఫ్ట్‌వేర్

- మిగతా 8లో..



## సూపర్‌సిక్స్ గాలికి పోయింది

- అన్నివర్గాలనూ మోసం చేశారు
- వైసీపీ అధినేత జగన్
- గ్రోత్‌రేట్ లేకుండా పోయింది

అమరావతి– సూర్య వాస్తవం

ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన కీలక హామీ సూపర్ సిక్స్ గాలికి కొట్టుకు పోయిందని, పేదలను మోసం చేశారని వైసిపి అధినేత జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. బడ్జెట్‌లో లెక్కలన్నీ తప్పుల తడకలని, ప్రజలను మోసం చేశారని అన్నారు. 2014 నాటికి రూ.1.47 లక్ష లక్షల కోట్లు అప్పుందని, 2019 నాటికి రూ.3.90 లక్షల కోట్లకు చేరిందని అన్నారు. 2024లో వైసిపి దిగిపోయే నాటికి చేసిన అప్పు రూ.3.31 లక్షల కోట్లని అన్నారు. ప్రస్తుతం చంద్రబాబు ప్రభుత్వం 18 నెలల్లో రూ.1.17 లక్షల కోట్ల అప్పు చేసిందని పేర్కొన్నారు. వీటిని లెక్కల్లో పారదర్శకంగా చూపించడం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వ

- మిగతా 8లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి



## చాలా పెద్ద తప్పు చేశావు జగన్!

- మంత్రి నారా లోకేశ్
- లడ్డూ కల్తీ ఆరోపణలకు నిరసనగా మండలిలో వైసీపీ నిరసన
- శ్రీవారి చిత్రపటాలను వైసీపీ ఎమ్మెల్సీలు అవమానించారని లోకేశ్ ఆరోపణ
- చెప్పులతో వెంకన్న ఫొటోలు పట్టుకోవడం క్షమించరాని పాపమన్న లోకేశ్
- జగన్‌కు దేవుడంటే భక్తి, భయం లేవని తీవ్ర విమర్శలు

2లో

## ఏఐ సమ్మిట్ వద్ద
# కాంగ్రెస్ నిరసన...

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం**

ఢిల్లీలో జరుగుతున్న ప్రతిష్ఠాత్మక 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సు' వద్ద యూత్ కాంగ్రెస్ కార్యకర్తలుగా భావిస్తున్న కొందరు చొక్కాలు విప్పి నిరసన తెలపడం తీవ్ర దుమారానికి దారి తీసింది. ఈ ఘటనపై తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్ తీవ్రంగా స్పందించారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ దర్శకత్వంలోనే ఈ నిరసన జరిగిందని, ఇది ఆయన చౌకబారు రాజకీయాలకు నిదర్శనమని వారు మండిపడ్డారు. ఈ ఘటనపై కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి సోషల్ మీడియా వేదికగా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "భారత్ ఏఐ సదస్సు ద్వారా స్పష్టమైన, గణనీయమైన ఫలితాలను అందుకుంటున్న తరుణంలో, రాహుల్ గాంధీ చౌకబారు రాజకీయాలు, హేయమైన చర్యలు, సిగ్గుమాలిన ప్రవర్తనను తీవ్రంగా ఖండించాలి. రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు కాంగ్రెస్ కార్యకర్తలు గూండాలు, పోకిరీల్లా చొక్కాలు లేకుండా తిరుగుతూ సదస్సుకు అంతరాయం కలిగించారు. ఇది మన యువతలోని స్ఫూర్తిని, పారిశ్రామిక స్ఫూర్తిని దారుణంగా అవమానించడమే. యువతను ప్రోత్సహించాల్సింది పోయి, రాహుల్ గాంధీ వారిలో నిరాశ, నిస్పృహలను నింపుతున్నారు" అని కిషన్ రెడ్డి విమర్శించారు. రాహుల్ గాంధీ ఏ చర్యలోనూ దేశ ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వలేదని, ప్రతి వేదికనూ దేశ పురోగతిని కించపరిచేందుకే వాడుకుంటున్నారని ఆరోపించారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సైతం కాంగ్రెస్ ద్వంద్వ వైఖరిని ఎండగట్టారు. "కాంగ్రెస్‌కు పూర్తిగా పిచ్చి పట్టింది. సిగ్గులేని ద్వంద్వ క్రీడ ఇది. ఏఐ సదస్సులో రాహుల్ గాంధీ దర్శకత్వంలో కాంగ్రెస్ గందరగోళం సృష్టిస్తూ చొక్కాలు విప్పి నిరసనల పేరుతో చౌకబారు నాటకాలు ఆడుతోంది" అని ఆయన మండిపడ్డారు. అదే సమయంలో, సదస్సు వేదిక లోపల అదే కాంగ్రెస్ పార్టీకి చెందిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ప్రపంచంలోని మేధావులను ఒకేచోటకు చేర్చినందుకు ప్రధాని మోదీని అభినందిస్తున్నారని బండి సంజయ్ గుర్తుచేశారు. "ఒకే పార్టీ, రెండు ముఖాలు, సున్నా గౌరవం. ఇది ప్రతిపక్షం తీరు కాదు, దేశాన్ని అవమానించడమే. ఇది రాజకీయ స్కిజోఫ్రెనియా. ప్రపంచ వేదికపై మువ్వన్నెల జెండా రెపరెపలాడుతున్నప్పుడు, గేటు వద్ద ఇలాంటి చౌకబారు రాజకీయాలు చేయకూడదు. ఎల్లప్పుడూ దేశానికే ప్రథమ ప్రాధాన్యత" అని బండి సంజయ్ తన పోస్టులో పేర్కొన్నారు. ప్రధాని మోదీకి, ప్రతిపాదిత భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా ఈ నిరసన నిర్వహించారు. ఈ ఒప్పందం దేశ సార్వభౌమత్వాన్ని దెబ్బతీసేలా ఉందని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రులు చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీశాయి.

## ఉపాధి హామీ పథకం పరిరక్షణకు
# అండగా నిలవాలి

**తెనాలి - సూర్య వాస్తవం**

కేంద్రంలోని బిజెపి సర్కార్ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నిందని, దీనిని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఉపాధి హామీ పథకం పరిరక్షణ యాత్ర శుక్రవారం తెనాలి చేరింది. నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ చందు సాంబశివుడు అధ్యక్షతన అన్నాబత్తుని పుర వేదిక వద్ద ఏర్పాటుచేసిన బహిరంగ సభలో షర్మిల మాట్లాడారు. గ్రామాలలో కూలీల వలసలను నివారించేందుకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ప్రతిపాదించి, అమలు చేశారని చెప్పారు. గ్రామ సీమల అభివృద్ధిని కోరుకున్న మహాత్మా గాంధీ పేరిట పథకాన్ని రూపొందించారని చెప్పారు. అయితే బిజెపి కుట్ర పూరిత ధోరణితో విబి గ్రామ్ జి గా పేరును మార్చి, సంస్కరణల పేరిట పథకాన్ని నిర్వీర్యం చేస్తుందన్నారు. గతంలో ఉపాధి హామీ పథకానికి దాదాపు నూరు శాతం నిధులను కేంద్ర ప్రభుత్వం చెల్లించేదని, తాజాగా చేసిన మార్పులలో 40 శాతం వాటా భారాన్ని రాష్ట్ర ప్రభుత్వంపై మోపుతోందన్నారు.. గత వైసిపి హయాంలో జగన్మోహన్ రెడ్డి, ప్రస్తుత కూటమి హయాంలో చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేశారని, రూ.11 లక్షల కోట్లు అప్పులోకి రాష్ట్రాన్ని నెట్టేశారని చెప్పారు. ఈ పరిస్థితులలో ఉపాధి హామీ పథకం అమలుకు రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.5వేల కోట్లు కేటాయించడం సాధ్యం కాదని, ఫలితంగా పథకం నిర్వీర్యమై పేదలకు ఉపాధి లేని పరిస్థితి ఎదురవుతుందన్నారు. కేంద్రంలోని బిజెపి సర్కారుకు టిడిపి, వైసిపి, జనసేన పార్టీలు అమ్ముడు పోయాయని, కేంద్రం విధానాలను ప్రశ్నించే దమ్ము ధైర్యం ఆ పార్టీలకి లేవని చెప్పారు. బిజెపి ప్రభుత్వాన్ని ఎదిరించే సత్తా కాంగ్రెస్ పార్టీకి మాత్రమే ఉందని, ఉపాధి హామీ పథకం పరిరక్షణకు నడుం బిగించి పోరాడుతున్న తరుణంలో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అండగా నిలవాలని కోరారు. అదే సమయంలో కాంగ్రెస్ హయాంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి పేదల సంక్షేమం కోసం ఉచిత విద్యుత్, పేదల చదువు కోసం ఫీజు రియంబర్స్మెంట్, ఆరోగ్య పరిరక్షణకు రాజీవ్ ఆరోగ్యశ్రీ, 108 అంబులెన్స్, మహిళలకు పావలా వడ్డీ రుణాలు తదితర సంక్షేమ పథకాన్ని అమలు చేసి ప్రజల పక్షాన నిలిచారని చెప్పారు. అదే స్ఫూర్తితో రాష్ట్ర కాంగ్రెస్ బాధ్యతలను చేపట్టిన తనకు ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఏఐసీసీ నాయకులు జెడి శీలం, డిసిసి అధ్యక్షులు యన్నం సుధీర్ బాబు రాష్ట్ర కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్వలి, ఉమ్మడి జిల్లా మాజీ జడ్పీ చైర్ పర్సన్ కూచిపూడి విజయ, గుంటూరు టు నియోజకవర్గ ఇన్చార్జ్ శ్యాంబాబు పాల్గొన్నారు.

# చాలా పెద్ద తప్పు చేశావు జగన్!

**న్యూఢిల్లీ- సూర్య వాస్తవం**

వైసీపీ ఎమ్మెల్సీలు శాసనమండలిలో కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి చిత్రపటాలను అవమానించారని, ఇది క్షమించరాని పాపమని ఏపీ మంత్రి నారా లోకేశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నేత జగన్‌కు దేవుడంటే భక్తి, భయం లేవని, హిందువుల మనోభావాలంటే అస్సలు లెక్కలేదని ఆయన మండిపడ్డారు. తిరుమల లడ్డూ ప్రసాదం కల్తీ అయ్యిందంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన ఆరోపణలకు నిరసనగా వైసీపీ సభ్యులు శుక్రవారం శాసనమండలికి శ్రీవారి చిత్రపటాలతో హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు బూట్లు, చెప్పులతోనే స్వామివారి చిత్రపటాలను పట్టుకుని ప్రదర్శించారని, సభ ముగిశాక వాటిని అక్కడే వదిలేసి వెళ్లారని లోకేశ్ ఆరోపించారు. ఈ ఘటనపై లోకేశ్ తీవ్రంగా స్పందించారు. "శ్రీవారికి చేసిన మహా పాపం కప్పిపుచ్చుకోవడానికి మహాపరాధం చేశావు జగన్. మీ వైసీపీ ఎమ్మెల్సీలు బూట్లు, చెప్పులతో వెంకటేశ్వర స్వామి చిత్రపటాలు పట్టుకుని మహాపరాధం చేశారు. అంతే కాకుండా, కౌన్సిల్‌లో ప్రదర్శించిన శ్రీవారి ఫొటోలు అక్కడే విసిరేసి వెళ్ళిపోవడం క్షమించరాని పాపం. వెంకన్నతో పెట్టుకోవద్దు జగన్!" అంటూ లోకేశ్ తీవ్రస్థాయిలో హెచ్చరించారు. ఈ మేరకు తన విమర్శలకు ఆధారంగా నారా లోకేశ్ వీడియోను కూడా పంచుకున్నారు.

# ప్రజా ప్రయోజనకారిగా మార్చండి

(మొదటిపేజీ తరువాయి)

జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో 16 ఏఐ, డీప్‌టెక్ స్టార్టప్‌ల సీఈఓలు, వ్యవస్థాపకులు తమ ఆలోచనలను, చేపట్టిన కార్యకలాపాల గురించి వివరించారు. తప్పుడు సమాచారం పట్ల అప్రమత్తత పాటిస్తూ బలమైన డేటా వ్యవస్థను రూపొందించాల్సిన ఆవశ్యకతను ప్రధాని నొక్కిచెప్పారు. భారత్ అవసరాలకు తగినట్లుగా పరిష్కార మార్గాలను అభివృద్ధి పరచాలని వారిని కోరారు. ఈ మేరకు ప్రధాని కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. యూపీఐని చాలా సులభమైన డిజిటల్ ఆవిష్కరణగా ప్రస్తావిస్తూ ప్రధాని, దేశీయ ఉత్పత్తుల పట్ల విశ్వాసాన్ని ప్రోత్సహించారు. అదే సమయంలో భారత కంపెనీల పట్ల కూడా విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. రోదసీ రంగంలో ప్రైవేటు ప్రాతినిధ్యాన్ని విస్తరించడం గురించి కూడా మాట్లాడారు. భారతీయ స్టార్టప్‌లపై పెట్టుబడిదారుల బలమైన ఆసక్తిని గుర్తించారు. వివిధ రంగాల్లో ఎఐ సాంకేతికతను విరివిగా ఉపయోగించుకోవడంతో పాటూ పంటల ఉత్పాదకతను, భూసారాన్ని పరిరక్షించేందుకు ఎరువుల వినియోగాన్ని పర్యవేక్షించాలని అన్నారు. భారతీయ భాషలను, సంస్కృతిని పెంపొందించాల్సిన ప్రాముఖ్యతను ప్రధాని నొక్కి చెప్పారు. మాతృభాషలో ఉన్నత విద్యకు ఏఐ టూల్స్‌ను విస్తరించాలని పిలుపిచ్చారు. సాహసోపేతమైన రిస్క్‌లు తీసుకుంటున్నం దుకు, ప్రభావవంతమైన పరిష్కారాలు రూపొందిస్తున్నందుకు ఆవిష్కర్తలను ఆయన అభినందించారు. ఆరోగ్య సంరక్షణ రంగంలో అధునాతమైన వ్యాధి నిర్ధారక మార్గాల కోసం, జన్యు చికిత్స కోసం, సమర్ధవంతమైన రీతిలో రోగుల రికార్డు నిర్వహణకు, చివరి వరకు నాణ్యతా సంరక్షణకు ఎఐని ఉపయోగించాల న్నారు ఇక వ్యవసాయంలో ఉత్పాదకతను పెంచడానికి, వాతావరణ సంబంధమైన ముప్పులను ఎదుర్కొనడంలో సాయపడేందుకు ఈ కృత్రిమ మేథను ఉపయోగించుకోవాలన్నారు. అలాగే సైబర్ భద్రత, నైతికతతో కూడిన ఎఐ, రోదసీ, న్యాయం, విద్య వంటి వాటిని స్థానిక భాషల్లో పొందడం ద్వారా సామాజిక సాధికారత రంగాలకు స ంబంధించిన ప్రాజెక్టులపై కూడా దృష్టి కేంద్రీకరించింది. సంస్థల ఉత్పాదకతను బలోపేతం చేయడానికి వారసత్వ వ్యవస్థను ఆధునీకరించడంపై కూడా దృష్టి పెట్టింది. "మొత్తంగా అందరూ కలిసి ఎఐతో కూడిన వినూత్న ఆవిష్కరణల్లో అంతర్జాతీయ నాయకత్వాన్ని నిర్మిస్తూనే స్థానిక అవసరాలను తీర్చే వ్యవస్థను తీసుకురావాలి." అని నిర్ణయించినట్లు పిఎంఓ ప్రకటన పేర్కొంది. ఎఐని ముందుకు తీసుకెళ్ళడానికి మద్దతుతో కూడిన, ప్రోత్సాహకర వాతావరణాన్ని భారత్ అందిస్తోందని స్టార్టప్‌లు పేర్కొన్నాయి. అంతర్జాతీయ ఎఐ తెరపై భారత్ తన ఉనికిని ధృఢంగా నిర్ధారిస్తుందని పేర్కొంది. భారత్ ఆతిథ్యం ఇచ్చిన ఎఐ ఇంపాక్ట్ సదస్సుపై సిఇఓలు అందరూ ప్రశంసలు కురిపించారు. ఎఐ చుట్టూ అంతర్జాతీయంగా చర్చలు జరిగేలా వాతావరణాన్ని సృష్టించడంలో పెరుగుతున్న భారత్ హోదాను ఇది ప్రతిబింబించిందని వారు పేర్కొన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి అబ్రిడ్జ్, అదాలత్ ఎఐ, బ్రెయిన్‌సైట్ ఎఐ, క్రెడో ఎఐ, ఏకా కేర్, గ్లీన్, మైకోచ ఆరిజిన్, సూపర్‌నొవా, సైఫా ఎఐ వంటి పలు సంస్థలు సీఈఓలు, వ్యవస్థాపకులు హాజరయ్యారు. ప్రిన్సిపల్ కార్యదర్శులు పి.కె.మిశ్రా, శక్తికాంత్ దాస్, మంత్రి జితిన్ ప్రసాద్‌లు కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు.

# నాలెడ్జ్, క్రియేటర్ ఎకానమీగా ఏపీ..

(మొదటిపేజీ తరువాయి)

భేటీ సందర్భంగా, ఏపీని నాలెడ్జ్ హబ్‌గా మార్చడమే తన లక్ష్యమని చంద్రబాబు వివరించారు. క్రియేటర్ ఎకానమీని పెద్ద ఎత్తున ప్రోత్సహించడానికి సహకారం అం దించాలని కోరారు. ఇందుకు స్పందించిన శంతను నారాయణ్, విద్యార్థులు, నిపు ణులకు నైపుణ్యాలు పెం చేందుకు ప్రత్యేకంగా క్రియేటర్ సాఫ్ట్‌వేర్‌ను అందిస్తా మని హామీ ఇచ్చారు. ఏపీలో ఏఐ లివింగ్ ల్యాబ్స్ ఏర్పాటు, పౌరసేవల డిజిటలైజేషన్ వంటి అంశాలపై కూడా ఇరువురి మధ్య ఫలప్రదమైన చర్చ జరిగింది.

ప్రపంచ ఇంధన దిగ్గజం సౌదీ ఆరామ్‌కో ప్రతినిధులతో ముఖ్యమంత్రి జరిపిన చర్చల్లో ఏపీలో సౌర విద్యుత్‌తో సహా క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టులపై దృష్టి సారించారు. గ్రీన్ ఎనర్జీ ఉత్పాదనకు రాష్ట్రం అత్యంత అనువైన ప్రాంతమని, ఇక్కడ కార్యకలాపాలు విస్తరించాలని ఆరామ్‌కోను ఆహ్వానించారు.

**ఏఐ, డిజైన్ రంగాల్లో భాగస్వామ్యానికి పిలుపు**

ఏఐ చిప్‌ల తయారీలో అగ్రగామిగా ఉన్న ఎన్విడియా సంస్థ వైస్ ప్రెసిడెంట్ కాలిస్టా రెడ్‌మెండ్‌తో సీఎం భేటీ అయ్యారు. రాష్ట్రంలో ఏఐ లివింగ్ ల్యాబ్స్ ఏర్పాటుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఐఐటీ తిరుపతి, ఐఐఎస్ఈఆర్ తిరుపతి భాగస్వామ్యంతో ఏర్పాటు చేస్తున్న 'ఏపీ ఫస్ట్' ప్రాజెక్టులో పాలుపంచుకోవాలని కోరారు. ఆటోడెస్క్ సీఈఓ మైక్ హేలీతో మాట్లాడుతూ.. ఏపీలో డిజైన్ ఇంజనీరింగ్ సొల్యూషన్స్ కోసం ఒక గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ (జీసీసీ) అభివృద్ధి చేయాలని సూచించారు.

**పాఠశాల స్థాయి నుంచే టెక్నాలజీ విద్య**

పాఠశాల విద్యార్థులకు చిన్నతనం నుంచే టెక్నాలజీపై అవగాహన కల్పించేందుకు లెగో ఎడ్యుకేషన్ సంస్థ సహకారం అందించాలని ముఖ్యమంత్రి కోరారు. రాష్ట్రంలోని పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్ లెర్నింగ్ ల్యాబ్స్ ఏర్పాటు చేయాలని ఆ సంస్థ వైస్ ప్రెసిడెంట్ టామ్ హాల్‌ను కోరారు. విశాఖపట్నంలో 'లెగోల్యాండ్ కల్చరల్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్' ఏర్పాటు చేయాలని కూడా ప్రతిపాదించారు. క్వాంటెలా ఇంక్ చైర్మన్ శ్రీధర్ గధితో సమావేశమై స్మార్ట్ గవర్నెన్స్, పౌరసేవల్లో ఏఐ సొల్యూషన్స్ వినియోగంపై చర్చించారు.

**ఏఐ స్టాళ్లను సందర్శించిన సీఎం**

సమావేశాల అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు భారత్ మండపంలో ఏర్పాటు చేసిన ఏఐ సమ్మిట్‌లోని వివిధ స్టాళ్లను సందర్శించారు. ఎన్విడియా, టాటా, ఇంటెల్, మైక్రోసాఫ్ట్ వంటి సంస్థలు ఏర్పాటు చేసిన ప్రదర్శనలను ఆసక్తిగా తిలకించారు. వ్యవసాయం, వైద్యం, పరిశ్రమల్లో ఏఐ వినియోగం ద్వారా వస్తున్న ఫలితాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా టాటా సంస్థ ఏపీలో అమలు చేస్తున్న 'సంజీవని' (డిజిటల్ హెల్త్ రికార్డులు), డిజిటల్ నెర్వ్ సెంటర్‌ను ప్రదర్శించింది. రోబోటిక్స్, ఏఐ ఆధారిత సేవల గురించి సీఎం ఆసక్తిగా తెలుసుకున్నారు. ఈ పర్యటన ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను టెక్నాలజీ, నాలెడ్జ్ ఎకానమీలో అగ్రగామిగా నిలపాలన్న తన దార్శనికతను చంద్రబాబు మరోసారి స్పష్టం చేశారు.

# ఏఐ స్టార్టప్ విలేజ్ ఏర్పాటుకు సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

రంగాల్లో విజయం సాధించిన భారత్, ప్రపంచ స్థాయి కోర్ టెక్నాలజీ ఉత్పత్తుల్లో కూడా నాయకత్వం వహించాలని అన్నారు. దేశానికి తక్షణ జాతీయ ఏఐ రోడ్‌మ్యాప్ అవసరమని స్పష్టం చేశారు. ఏఐ అభివృద్ధి ప్రతి దశలో సెమీకండక్టర్ చిప్ తయారీ, జీపీయూ సామర్థ్యాలు, డేటా సెంటర్లు, గ్రీన్ ఎనర్జీ వినియోగం, ఏఐ ప్లాట్‌ఫారమ్‌లు, అప్లికేషన్లలో భారత్ స్పష్టమైన వ్యూహంతో ముందుకు సాగాలని సూచించారు.

ప్రపంచవ్యాప్తంగా ఏఐ పరిణామాలను నిశితంగా పర్యవేక్షించేందుకు కేంద్రం-రాష్ట్రాల సమన్వయంతో జాతీయ "ఏఐ వార్ రూమ్" ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపాదించారు. కేంద్రం అనుమతిస్తే హైదరాబాద్‌లో అలాంటి వార్ రూమ్ నిర్వహించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రపంచ స్థాయి పరిశోధనలకు ఊతమిచ్చే ఏఐ యూనివర్సిటీని దేశంలో స్థాపించాలని సూచించారు. ఏఐ విస్తరణ నేపథ్యంలో ఉపాధిపై ఉద్భవిస్తున్న ఆందోళనల ను ప్రస్తావిస్తూ, కొన్ని రంగాల్లో ఉద్యోగ నష్టాలు సంభవించవచ్చని అన్నారు. అయితే సరైన రీ-స్కిల్లింగ్, అప్-స్కిల్లింగ్ చర్యల ద్వారా ఏఐ వల్ల సృష్టించబడే కొత్త అవకాశాలు మరింత విస్తృతంగా ఉంటాయని అభిప్రాయపడ్డారు.

యువతను ఏఐ-ఆధారిత భవిష్యత్తుకు సిద్ధం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. స్టార్టప్‌లకు మద్దతు కల్పించేందుకు జాతీయ ఏఐ నిధి ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ప్రతిపాదించారు. దేశవ్యాప్తంగా ఏఐ ఆవిష్కరణలకు కేంద్రంగా నిలిచే "ఏఐ స్టార్టప్ విలేజ్"ను తెలంగాణలో ఏర్పాటు చేయడానికి రాష్ట్రం సిద్ధంగా ఉందని ప్రకటించారు. ఏఐ రంగంలో విధానాలు, చట్టాలు, నైతిక ప్రమాణాలకు మార్గనిర్దేశం చేసే అత్యున్నత సంస్థగా ఇండియా ఏఐ కౌన్సిల్‌ను ఏర్పాటు చేయాలని ప్రధానమంత్రిని కోరారు. ఏఐ అభివృద్ధి సామాజిక న్యాయం, పేదరిక నిర్మూలన, ప్రజా సేవల మెరుగుదల, జాతీయ భద్రతకు తోడ్పడేలా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. బాధ్యతాయుతమైన, సమ్మిళిత, భవిష్యత్ దృష్టితో కూడిన ఏఐ వ్యవస్థను నిర్మించేందుకు ప్రపంచ నిపుణులు, సంస్థలు కలిసి పని చేయాలని ఆయన కోరారు. ఈ మార్పు యుగంలో భారత్ నాయకత్వం వహించాల్సిన సమయం ఇదేనని ఆయన స్పష్టం చేశారు.

# సూపర్‌సిక్స్ గాలికి పోయింది

(మొదటిపేజీ తరువాయి)

ఉద్యోగులకు రూ.35 వేల కోట్ల బకాయిపడ్డారని, ఎన్నికల ముందు వాటిని ఇస్తానని చెప్పి ఇప్పటి వరకూ ఇవ్వలేదని తెలిపారు. యువతకు ఉపాధి లేదని, ఆడబిడ్డనిధి ప్రస్తావన లేదని పేర్కొన్నారు. ఎస్సి, ఎస్టి, బిసిలకు 50 ఏళ్లకే పెన్షన్ ఇస్తామని ఇంత వరకూ ఇవ్వకపోగా ఆరు లక్షల పెన్షన్లకు కోత పెట్టారని విమర్శిం చారు. స్కూల్‌కు వెళ్లే ప్రతి పిల్లాడికి రూ.15 వేలు ఇస్తామని చెప్పి అందరికీ ఇవ్వలేదన్నారు. నిరుద్యోగ భృతి లేదని, స్త్రీశక్తి పథకం పేరుతో మహిళలను నిలువునా మోసం చేశారని పేర్కొన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ప్రతిసారీ పెన్షన్లు తగ్గించుకుంటూ వస్తున్నారని, బడ్జెట్లో పెన్షన్లకు నిధులు పెంచాల్సింది పోయి తగ్గించారని, ఆ లెక్కన మరో 7.45 లక్షల పెన్షన్లు రద్దు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉందని అర్థమవుతోందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్క కొత్త పెన్షన్ కూడా ఇవ్వలేదని, తల్లికి వందనం కేటాయిపుంల్లోనూ లక్షమందికి ఎగనామం పెట్టేందుకు సిద్ధమయ్యారని పేర్కొన్నారు. అన్నదాత సుఖీభవ కింద ఏడాదికి రూ.20 వేలు ఇస్తామన్నారని, దానికీ కోత విధించారని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్లు చేసిన 21 రోజుల్లోనే డబ్బు జమచేశామని, ప్రస్తుతం ప్రభుత్వం ఇ-క్రాప్ తొలగించిందని, దళారులను తెచ్చిందని అన్నారు. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. వడ్డీలేని రుణాలకూ కోతపెట్టారని పేర్కొన్నారు.

**ఇందాపూర్ డెయిరీ హెరిటేజ్‌దే**

ఇందాపూర్ డెయిరీ హెరిటేజ్‌దేనని జగన్‌మోహన్‌రెడ్డి ఆరోపించారు. తిరుపతి లడ్డూకోసం ఇందాపూర్ డెయిరీ నెయ్యి సరఫరా చేసిందని తెలిపారు. 2016లోనే ఎఆర్ డెయిరీకి అనుమతులు ఇచ్చారని, ఇటీవల వరకూ తమ ఉత్పత్తి సంస్థగా పేర్కొన్న డెయిరీని ఇటీవల విమర్శలు రావడంతో కో ప్రొడక్షన్ యూనిట్‌గా మార్చారని అన్నారు. బోలేబాబా కూడా హెరిటేజ్ అనుబంధంగా పనిచేస్తోందని, ఇండియా మార్ట్ ఇ-కామర్స్ సంస్థ వెబ్‌సైట్లో ఉందని తెలిపారు.

ఇందాపూర్ డెయిరీ వ్యవహారం వెలుగులోకి రావడంతో సేల్స్‌హెడ్‌ను తొలగించారని అన్నారు. 2016లోనే ఇందాపూర్ డెయిరీ నెయ్యి నాణ్యత లోపించిందని డిస్‌క్వాలిఫై చేసి వెంటనే క్వాలిఫై చేశారని అన్నారు. బోలేబాబా ఆర్గానిక్ డెయిరీ హర్ష్? డెయిరీ ఒకటేనని తెలిపారు. గతంలో రిజక్ట్ అయిన ట్యాంకర్లు శ్రీకాళహస్తి సమీపంలోని క్రషర్‌లో ఉన్నాయని, తిరిగి అవే తిరుమలకు వైష్ణవి డెయిరీ పేరుతో వెళ్లాయని తెలిపారు. ఈ తతంగం మొత్తం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే జరిగిందని అన్నారు.

# సంపాదకీయం

## ప్రజలను సోమరులుగా చేస్తున్నారా ?



ఉచితాలపై సర్వోన్నత న్యాయస్థానం ప్రభుత్వాలను తలంటిది. సంక్షేమం పేరుతో ఉచిత పథకాలను ప్రవేశపెట్టి, ప్రజలను సోమరులుగా చేస్తున్నారని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ప్రజలు పనిచేయడానికి ఇష్టపడని కల్చర్ పెరిగిపోతుందని, ఇది మంచిది కాదని అభిప్రాయపడింది. ఈ క్రమంలో పంచుకుంటూ పోతే అభివృద్ధికి ఏమీ మిగలదని మండిపడింది. తమిళనాడు ప్రభుత్వం ఉచిత విద్యుత్ పథకంపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. ఇది ఒక్క తమిళనాడు సమస్యే కాదని, అన్ని రాష్ట్రాలకు ఇది వర్తిస్తుందని వ్యాఖ్యానించింది.రాష్ట్ర ప్రభుత్వాలు అందజేసే 'ఉచితాల'పై సుప్రీంకోర్టు గురువారం ఉదయం తీవ్ర విమర్శలు చేసింది. ఉచిత ఆహారం, విద్యుత్తును అందించడం కొనసాగిస్తే వాస్తవ అభివృద్ధికి ఎలా నిధులు సమకూర్చుకుంటారో చెప్పాలని అత్యున్నత న్యాయస్థానం ప్రశ్నించింది. త్వరలోనే ఎన్నికల జరగనున్న తమిళనాడులో ఆర్థిక స్థితితో సంబంధం లేకుండా రాష్ట్రంలో ప్రజలందరికీ ఉచిత విద్యుత్ పథకం అమలుకు డీఎంకే ప్రభుత్వం ఆమోదించింది. లోటు బడ్జెట్ ఉన్నప్పటికీ సబ్సిడీల కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్న రాష్ట్రాలు.. అభివృద్ధికి నిధులు కేటాయించకపోడంపై సర్వోన్నత న్యాయస్థానం తప్పుబట్టింది.ముఖ్యంగా ఆర్థిక స్థోమత ఉన్నవారికి విచక్షణారహితంగా ఉచిత పథకాలను అందజేయడం వల్ల పని చేయకుండానే ప్రతిఫలం లభించే సంస్కృతి ఏర్పడిందని సుప్రీంకోర్టు హెచ్చరించింది. ఈ పథకాన్ని చివరి నిమిషంలో ఎందుకు ప్రకటించారో వివరించాలని తమిళనాడు ప్రభుత్వాన్ని న్యాయస్థానం ఆదేశించింది. భారతదేశ రాజకీయాల్లో ఉచిత పథకాలు ఓ బలమైన ఆయుధంగా మారాయి. ఎన్నికల సమయంలో ఓటర్లను ఆకర్షించేందుకు రాజకీయ పార్టీలు ఇచ్చే హామీలు, అమలు చేసే పథకాలు ఇప్పుడు దేశ అత్యున్నత న్యాయస్థానం వద్ద తీవ్ర చర్చకు దారితీశాయి. తాజాగా తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వం ప్రకటించిన ఉచిత విద్యుత్ పథకంపై సుప్రీంకోర్టు వ్యక్తం చేసిన అసహనం, దేశ ఆర్థిక భవిష్యత్తుపై ఉన్న ఆందోళనను ప్రతిబింబిస్తోంది.తమిళనాడు ప్రభుత్వం ఆర్థిక స్థితిగతులతో సంబంధం లేకుండా అందరికీ ఉచిత విద్యుత్తును అందించాలని నిర్ణయించింది. దీనిపై దాఖలైన పిటిషన్‌ను విచారించిన చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ విపుల్ పంచోలిలతో కూడిన ధర్మాసనం తీవ్ర వ్యాఖ్యలు చేసింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని, రెవెన్యూ లోటును పట్టించుకోకుండా ఇటువంటి నిర్ణయాలు ఎలా తీసుకుంటారని ప్రశ్నించింది. సుప్రీంకోర్టు సంక్షేమ పథకాలకు వ్యతిరేకం కాదని, కానీ 'అర్హత' లేని వారికి కూడా ఉచితాలు పంచడం సరికాదని స్పష్టం చేసింది. నిజంగా పేదరికంలో ఉండి, కరెంట్ బిల్లులు కట్టలేని వారికి సహాయం చేయడం సంక్షేమం అవుతుంది. కానీ, సంపన్నులకు కూడా ఉచిత విద్యుత్ ఇవ్వడం వల్ల ప్రభుత్వ ఖజానాపై అనవసర భారం పడుతుందని కోర్టు అభిప్రాయపడింది."మనం ఎలాంటి సంస్కృతిని అభివృద్ధి చేస్తున్నాం?" అన్న ధర్మాసనం ప్రశ్న ఇక్కడ కీలకం. ఒక దేశం అభివృద్ధి చెందాలంటే ఉపాధి అవకాశాలు, మౌలిక సదుపాయాల కల్పనపై పెట్టుబడి పెట్టాలి. కానీ, బడ్జెట్‌లో మెజారిటీ వాటా ఉచిత పథకాలకే ఖర్చు చేస్తే, కొత్త పరిశ్రమల స్థాపనకు లేదా మౌలిక వసతులకు నిధులు ఎక్కడి నుండి వస్తాయని కోర్టు ప్రశ్నించింది. ఎన్నికల ముందే ఇటువంటి పథకాలను ఎందుకు ప్రకటిస్తారని కోర్టు ప్రశ్నించడం ద్వారా, రాజకీయ పార్టీలు అధికారం కోసం దేశ ఆర్థిక వ్యవస్థను పణంగా పెడుతున్నాయని పరోక్షంగా హెచ్చరించింది. ఓట్ల వేటలో భాగంగా ఇచ్చే ఈ అశాస్త్రీయ హామీలు చివరకు రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేసే ప్రమాదం ఉంది. చాలా రాష్ట్రాలు ఇప్పటికే భారీ అప్పుల్లో ఉన్నాయి. సొంత ఆదాయం కంటే ఖర్చు ఎక్కువగా ఉన్నా, రాజకీయ ప్రయోజనాల కోసం ఉచితాల పంపిణీని ఆపడం లేదు. ఇది దీర్ఘకాలంలో దేశ జిడిపి వృద్ధిపై ప్రతికూల ప్రభావం చూపుతుందని ఆర్థిక నిపుణులు కూడా హెచ్చరిస్తున్నారుఉచితంగా వస్తువులను పంపిణీ చేయడం కంటే, ప్రజలకు ఉద్యోగ అవకాశాలు కల్పించి వారి కొనుగోలు శక్తిని పెంచడంపై దృష్టి సారించాలని కోర్టు సూచించింది. ఈ అంశం కేవలం ఒక రాష్ట్రానికే పరిమితం కాకుండా దేశవ్యాప్త ప్రభావం చూపుతున్నందున, కేంద్ర ప్రభుత్వానికి కూడా సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది.ప్రజాస్వామ్యంలో ప్రజల అవసరాలను తీర్చడం ప్రభుత్వ బాధ్యత. అయితే, అది బాధ్యతాయుతమైన ఆర్థిక నిర్వహణతో కూడి ఉండాలి. ఉచిత పథకాలు తక్షణ ఉపశమనాన్ని కలిగించినప్పటికీ, అవి దేశ నిర్మాణానికి పునాదులు కావు. సుప్రీంకోర్టు చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయ పార్టీలకు ఒక హెచ్చరిక లాంటివి. ఉచితాల సంస్కృతి నుండి బయటపడి, సుస్థిర అభివృద్ధి వైపు అడుగులు వేయాల్సిన సమయం ఆసన్నమైందని ఈ తీర్పు స్పష్టం చేస్తోందిప్రభుత్వ నిర్ణయంతో విద్యుత్ పంపిణీ సంస్థలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని వ్యాఖ్యానించింది.దేశంలో ఎలాంటి సంస్కృతిని తీసుకొస్తున్నామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. "ఉదయం లేవగానే ఉచిత ఆహారంతో మొదలు పెట్టి. తర్వాత ఫ్రీ సైకిల్, కరెంట్.. ఇప్పుడు మనం నేరుగా ప్రజల ఖాతాల్లోకి నగదు బదిలీ చేసే దశకు చేరుకుంటున్నాం...ఒక్కసారి ఊహించుకోండి" అని అన్నారు. సంక్షేమ వ్యవస్థలో భాగంగా అల్పదాయ వర్గాల వారికి అందజేయడం సమంజసమే.. కానీ, ఉన్నవారు, లేనివారు అనే తేడా లేకుండా పంపిణీ చేస్తే ఎలా" జస్టిస్ సూర్యకాంత్ అన్నారు."విద్యను పొందలేని పిల్లలకు అందించడం ప్రభుత్వం విధి... కానీ ఇప్పటికీ సంపన్నులు ఉచితాలను ముందుగా వారి జేబుల్లో నింపుకుంటారు.. రాష్ట్రాలు ఈ విధానపరమైన నిర్ణయాలను పునఃసమీక్షించాల్సిన సమయం ఆసన్నమైంది" అని ప్రధాన న్యాయమూర్తి ప్రశ్నించారు. అంతేకాదు, కనీసం ఒక్క త్రైమాసిక ఆదాయాన్ని అభివృద్ధికి తప్పనిసరిగా వినియోగించాలని జస్టిస్ సూర్యకాంత్ అన్నారు."కొన్నిసార్లు నిజంగా ఆందోళన చెందుతాం.. మిగులు రాష్ట్రమైనప్పటికీ... మౌలిక సదుపాయాలు, ఆసుపత్రులు, పాఠశాలలు, కళాశాలల అభివృద్ధికి ఖర్చు చేయడం మీ బాధ్యత కాదా? దీనికి బదులుగా ఎన్నికల సమయంలో మీరు ఉచితాలను పంపిణీ చేస్తూనే ఉంటారు... ప్రభుత్వాల ఇటువంటి విధానాల కారణంగా అభివృద్ధికి ఒక్క పైసా కూడా మిగలదు.. ఇదీ మీది మాత్రమే కాదు అన్ని రాష్ట్రాల సమస్య" అని తమిళనాడు ప్రభుత్వానికి కోర్టు తెలిపింది.కాగా, ఉచితాలు భవిష్యత్తు తరాలకు భరించలేని ఆర్థిక భారాలను సృష్టిస్తుందనే ఆందోళనల నేపథ్యంలో ఇది పరిశీలించాల్సిన చాలా ముఖ్యమైన అంశమని ఈ జనవరిలో సీజేఐ వ్యాఖ్యానించారు. "ఉచిత వైద్యం, విద్య, ప్రజా సంక్షేమ చర్యలు, అది సరే... కానీ సంక్షేమ పథకాలపై ఖర్చు చేయడం కంటే అలాంటి వాటిలో పెద్దగా ఖర్చు చేయకపోవడం పరిశీలించాల్సి అంశమే" అని అన్నారు.

# తెలుగు తమ్ముళ్ల ధిక్కార స్వరం

**ఏలూరు – సూర్య వాస్తవం**

ఏపీలో టీడీపీకి కంచుకోట లాంటి నియోజకవర్గాలు చాలానే ఉన్నాయి. గతంలో కాంగ్రెస్, వైసీపీ గాలిలోనూ గెలిచిన సీట్లు ఉన్నాయి. అలాంటి నియోజకవర్గాల్లో ఉండి కూడా ఒకటి. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా లోని ఉండి నియోకవర్గంలో టీడీపీ వరుస విజయాలు దక్కించుకోవడమే కాదు. 2004లో తప్ప..ఎప్పుడూ అక్కడ పార్టీ ఓడింది లేదు. క్షత్రియులకు బలమైన సెగ్మెంట్‌గా ఉన్న ఈ నియోజకవర్గంలో ఎప్పుడూ సైకిల్‌దే హవా. పార్టీ ఆవిర్భావం నుంచి ఇక్కడ పాగా వేసేందుకు వైసీపీ చేయని ప్రయత్నాలు లేవు. గత ఎన్నికల్లో అభ్యర్థిని మార్చి లాస్ట్ మూమెంట్‌లో వైసీపీ నుంచి వచ్చిన రఘురామ కృష్ణరాజుకు టీడీపీ సీటు ఇచ్చినా.. ప్రజలు సైకిల్ పార్టీకే పట్టం కట్టారు. నియో జకవర్గంలో టీడీపీ నేతల ధిక్కార స్వరం చర్చనీ యాంశంగా మారింది. ఏకంగా రఘురామ కృష్ణరాజు తీరుపై విమర్శలు, ఆరోపణలు చేస్తున్నారు తెలుగు తమ్ముళ్లు. ఎమ్మెల్యే కమ్..ఉప సభాపతిగా ఉన్న రఘురామ కృష్ణరాజు వైఖరిని తప్పుబడుతూ..ఒకరిద్దరు టీడీపీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలు రాజకీయంగా దుమారం రేపుతున్నాయి. ఆయన ఒంటెత్తు పోకడలకు పోతున్నారని..రఘురామ తీరుతో పార్టీలో ఐక్యత దెబ్బతింటోందని కొందరు లీడర్లు ఓపెన్ స్టేట్‌మెంట్లు ఇస్తూ చర్చకు దారితీశారు.

రఘురామ ముందు నుంచి టీడీపీలో పనిచేసిన నేత కాకపోవడంతో ఇక్కడ తెలుగు తమ్ముళు అసంతృప్తి రాగం ఎత్తుకున్నట్లు చర్చ జరుగుతోంది. వాస్తవానికి గతంలో ఎప్పుడూ టీడీపీలో పని చేయలేదు రఘురామ కృష్ణరాజు. బిజినెస్‌మెన్‌గా వెరీ పాపులర్. ఆ తర్వాత వైసీపీలో, బీజేపీలో తిరిగి వైసీపీలో పనిచేసి 2019లో ఎంపీగా గెలిచారు. ఆ తర్వాత కొన్నాళ్లకే వైసీపీ అధిష్టానంతో గిట్టక అసంతృప్తి రాగం వినిపిస్తూ వచ్చారు. జగన్ సర్కార్ హయాంలో ఆయన కేసులు కూడా ఫేస్ చేశారు.

ఆ తర్వాత టీడీపీకి దగ్గరవుతూ వచ్చారు. ఫైనల్‌గా 2024కు ముందు రఘు రామ కృష్ణరాజు టీడీపీలో చేరారు. నరసాపురం ఎంపీ టిక్కెట్ ఆశించినా కూటమి పొత్తులో అది బీజేపీకి ఇచ్చారు. దీంతో ఉండి సిట్టింగ్ ఎమ్మెల్యేను కాదని.. టీడీపీ రఘురామ కృష్ణరాజుకు టికెట్ ఇచ్చింది. అయితే వైసీపీ నుంచి వచ్చిన రఘురామ కృష్ణ తన అనుచరులను.. గతంలో



వైసీపీలో పనిచేసిన నేతలను ప్రోత్సహిస్తూ వారికే పదవులు కట్టబెడుతున్నారని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. వైసీపీ నుంచి వచ్చిన వారికి నామినేటెడ్ పదవులు కట్టబెడుతూ, పార్టీ కమిటీల్లోనూ ఇతర పార్టీల నేతలకు అవకాశాలు ఇస్తున్నారని.. సీనియర్ నేతలను పట్టించుకోవడం లేదని..టీడీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పొత్తూరి వెంకటేశ్వరరాజు అలిగేషన్స్ చేస్తున్నారు. రఘురామను వ్యతిరేకిస్తే భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వచ్చే ఎన్నికల్లో తన కొడుకు రాజకీయ అరంగేట్రం కోసం రఘురామ కృష్ణరాజు ఇప్పటినుంచే తన వర్గాన్ని ఏర్పాటు చేసుకున్నారని కూడా చెప్తున్నారు. దీంతో ఉండి టీడీపీలో పరిణా మాలపై అధిష్టానం దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.

అయితే ఏ పార్టీలో అయినా ఏ నియోజకవర్గంలో అయినా కొత్త, పాత లొల్లి కామన్. పార్టీ అన్నాక సమస్యలు..పదవుల దగ్గర పేచీ కూడా ఉండనే ఉంటుంది. సీనియర్ లీడర్ల అసంతృప్తి కూడా ఉండనే ఉంటుంది. వాటిన్నింటిని సామరస్యంగా పరిష్కరించు కుంటే నో ప్రాబ్లమ్. పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను సాల్వ్ చేసుకోవచ్చు. కానీ కొందరు నేతలు..బహిరంగ విమర్శలు చేయడం హాట్ టాపిక్‌గా మారింది. ఇలా తెలుగు తమ్ముళ్ల ఓపెన్ స్టేట్‌మెంట్లు ఇస్తే ప్రత్యర్థులకు అస్త్రాలు అందించినట్లు అవుతుందని అంటున్నారు. అటు ఏపీ డిప్యూటీ స్పీకర్‌గా ఉన్న రఘురామ కృష్ణరాజుకు సొంత నియోజకవర్గంలో లీడర్ల నుంచి అసంతృప్తి సెగ తగలడం చర్చనీయాంశంగా మారింది. అధికార పార్టీలో ప్రముఖ నేతగా ఉన్న ఆయనపై సొంత పార్టీ నేతలే తిరుగుబావుటా ఎగరవేయడం కలకలం రేపుతోంది. రఘురామ తీరుతో టీడీపీని నమ్ముకుని ఉన్న కార్యకర్తలు, నాయకులు ఆగమైపోతున్నారని, సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ కలగజేసుకోవాలని కోరుతున్నారు స్థానిక నేతలు.అయితే ఉండి నియోజకవర్గంలో ఎప్పుడూ లేనట్లుగా విభేదాలు రచ్చకెక్కడం..తొలిసారి ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్‌గా ఉన్న రఘురామపై ఆరోపణలు చేయడం సంచలనంగా మారింది. అసలు ఈ పరిస్థితికి కారణమేంటి? రఘురామ ఒంటెద్దు పోకడలకు పోతున్నారా? లేక ఎన్నికలకు ముందు టీడీపీలోకి వచ్చిన రఘురామకు టీడీపీ క్యాడర్, లీడర్లతో సరైన సంబంధాలు లేవా? లేక టీడీపీ నేతలకే రఘురామ అంటే గిట్టట్లేదా? అన్నది హాట్ టాపిక్ అవుతోంది. ఉండి నియోజకవర్గంలో పరిస్థితులపై పార్టీ హైకమాండ్ కూడా ఆరా తీసిందన్న వార్తలు కూడా ఆసక్తికరంగా మారాయి. ఇదే సమయంలో గత ప్రభుత్వంలో ఎంపీగా ఉంటూ నిత్యం అసమ్మతి రాగం వినిపించిన రఘురామ ఇప్పుడు అదే పరిస్థితిని ఫేస్ చేస్తుండటం ఇంకా ఇంట్రెస్టింగ్‌గా మారింది.

# నకిలీ మానవ హక్కుల సంఘాలపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఉక్కుపాదం

- రాష్ట్రాలకు ఆదేశాలు - ఎన్‌హెచ్‌ఆర్‌సీ పేరుతో పుట్టుకొస్తున్న నకిలీ సంస్థలపై కమిషన్ ఆగ్రహం
- వాటిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశం
- రెండు వారాల్లోగా నివేదిక సమర్పించాలని స్పష్టం చేసిన ఎన్‌హెచ్‌ఆర్‌సీ
- ఢిల్లీలో రిజిస్టర్ అయిన ఓ నకిలీ సంస్థపై ప్రత్యేకంగా దృష్టి
- ప్రజల్లో గందరగోళాన్ని నివారించేందుకే ఈ నిర్ణయమని వెల్లడి

**న్యూఢిల్లీ – సూర్య వాస్తవం**

తమ పేరును పోలిన పేర్లతో రిజిస్టర్ అయి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న నకిలీ సంస్థలు, వ్యక్తులపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) తీవ్రంగా స్పందించింది. ఇలాంటి సంస్థలపై దేశవ్యాప్తంగా కఠిన చర్యలు తీసుకోవాలని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను ఆదేశించింది. ఈ మేరకు తీసుకున్న చర్యలపై రెండు వారాల్లోగా నివేదిక సమర్పించాలని గురువారం స్పష్టం చేసింది.

ఇటీవల తమ దృష్టికి వచ్చిన ఓ ఘటనను ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఉదహరించింది. ఢిల్లీ ప్రభుత్వంతో 2022లో 'నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ)' పేరుతో ఓ ఎన్జీవో రిజిస్టర్ అయినట్లు ఫిర్యాదులు అందాయని తెలిపింది. ఆ సంస్థ తమకు నీతి ఆయోగ్, కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, సామాజిక న్యాయ మంత్రిత్వ శాఖల గుర్తింపు ఉందని ప్రచారం చేసుకుంటోందని పేర్కొంది. కర్ణాటకకు చెందిన వెంకటేశ్ అనే వ్యక్తి ఈ సంస్థకు 'స్టేట్ చైర్మన్'గా వ్యవహరిస్తున్నట్లు తేలిందని వెల్లడించింది. ఈ వ్యవహారం తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న కమిషన్, దీనిపై సుమోటోగా విచారణ చేపట్టింది. ఇలాంటి మోసపూరిత పేర్లు ప్రజలను గందరగోళానికి గురిచేస్తాయని, ఈ సంస్థలు ఎన్‌హెచ్‌ఆర్‌సీలో భాగమని లేదా తమచే గుర్తింపు పొందాయని భ్రమ కల్పిస్తున్నాయని అభిప్రాయపడింది. ఇది ప్రజల్లో కమిషన్ పట్ల నమ్మకాన్ని దెబ్బతీయడమే కాకుండా,




నిధుల దుర్వినియోగానికి దారితీసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. గతంలో పలుమార్లు హెచ్చరించినా, ఉల్లంఘనలు కొనసాగుతున్నాయని పేర్కొంది.

ఈ నేపథ్యంలో, అన్ని రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల చీఫ్ సెక్రటరీలు, డీజీపీలకు నోటీసులు జారీ చేసింది. ఎన్‌హెచ్‌ఆర్‌సీ పేరును దుర్వినియోగం చేస్తున్న సంస్థలను గుర్తించి, వాటి రిజిస్ట్రేషన్లను రద్దు చేయడంతో పాటు తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ప్రత్యేకించి, ఢిల్లీలో రిజిస్టరై కర్ణాటకలో కార్యకలాపాలు సాగిస్తున్న సదరు నకిలీ సంస్థపై తీసుకున్న చర్యలపై రెండు వారాల్లో నివేదిక ఇవ్వాలని ఢిల్లీ, కర్ణాటక రాష్ట్రాల ఉన్నతాధికారులను ఆదేశించింది.

## ఎంపీపీ పాఠశాలలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

### - ప్రిన్సిపల్ నాగేంద్ర



**వేంపల్లె - సూర్య వాస్తవం :** స్థానిక వైయస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో చింతలమడుగుపల్లెలోని ఎంపీపీ స్కూల్లో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేయడమైనదని కళాశాల ప్రిన్సిపల్ ఎస్. నాగేంద్ర తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ కే.సతీష్ వైస్ ప్రిన్సిపల్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్య అవగాహన ప్రధాన అంశాలుగా కార్యక్రమం చేపట్టామని విద్యార్థులకు తెలియజేశారు. షేక్ మస్తాన్ వల్లి హెడ్మాస్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు చిన్నతనం నుంచే సేవాగుణం అలవర్చుకోవాలని సూచించారు. సమాజ సేవ, సామా జిక బాధ్యతల ప్రాముఖ్యతను వివరించి గ్రామ అభివృద్ధిలో విద్యార్థుల పాత్రను ఎంతో ముఖ్యమని వివరించారు. డాక్టర్ సి.మల్లేశ్వరమ్మ ఎన్ఎస్ఎస్ యూనిట్ -2 పీఓ మాట్లాడుతూ చేయవలసిన కార్యక్రమాల గురించి క్షుణ్ణంగా విద్యార్థులకు తెలియజేశారు. సమాజ అభివృద్ధిలో విద్యార్థులు ముందంజలో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ ఓబుల్ రెడ్డి, పీడీ తేజేంద్ర, టీచర్లు పి.లక్ష్మీ నరసింహ, ఇందుమతి, స్కూల్లో పనిచేయుచున్న అధ్యాపక అధ్యాపకేత్ర బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలి

### - సబ్ యూనిట్ అధికారి సిద్ధయ్య





**వేముల - సూర్య వాస్తవం :** వేముల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోనూ వి.కొత్తపల్లె గ్రామంలో సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య ఆధ్వర్యంలో శుక్రవారం రోజున "ఫ్రైడే - డ్రైడే" కార్యక్రమం నిర్వహించి నిల్వ నీటిలో లార్వా నిర్మూలన కోసం అబేట్ పిచికారి చేసి, ఇంటింటా ఫీవర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య మాట్లాడుతూ ప్రజలకు మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి వ్యాధులు ఎలా వ్యాపిస్తాయి, వాటి నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు, ఇంటి చుట్టుపక్కల నీరు నిల్వలు ఉండకుండా చూసుకోవడం, దోమల పెరుగుదల నివారణకు పాటించ వలసిన చర్యల గురించి, వివరించి ప్రజలు ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి, నీటి నిల్వలను ఖాళీ చేసి, దోమల పెరుగుదలను అరికట్టాలని, రాత్రి పూట తప్పని సరిగా దోమతెరాలు వాడాలి అని దోమలు మంచి నీటిలోనే గుడ్లు పెడతాయని, డెంగ్యూ దోమ పగటిపూటనే కూడుతాయని సిద్దయ్య తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ రమేష్ ఆరోగ్య కార్యకర్త శ్రీనివాసులు ఆశా కార్యకర్త నాగలక్ష్మి పాల్గొన్నారు.

## చౌడేశ్వరి అమ్మవారికి విశేష పూజలు




**పులివెందుల - సూర్య వాస్తవం :** పులివెందుల పట్టణంలోని బ్రాహ్మణపల్లి రోడ్డు చౌడమ్మ వీధిలో కొలువైన సాక్షిమాత,కాశి విశాలాక్షి అయిన శ్రీ రామలింగ చౌడేశ్వరి దేవస్థానంలో అమ్మవారికి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. శుక్రవారము పురస్కరించుకుని ఉదయస్తమాన ఆలయ ప్రధాన అర్చకులు ప్రవీణ్ స్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి సుప్రభాత సేవ విశేష పంచామృతాభిషేకం,కుంకుమార్చన ,మహా మంగళహారతి తదితర పూజా కైంకర్యాలు అనంతరం అమ్మవారు విశేష పూల అలంకారంలో చౌడేశ్వరి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.ప్రత్యేకించి ఆలయున ఉదయం 10.30 నిమిషములకు రాహుకాల దీపాలు వెలిగించి రాహుకాల పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భముగా ఆలయ నిర్వాహకులు రాజేంద్రప్రసాద్ ,అర్చకులు ప్రవీణ్ స్వామి మాట్లాడుతూ ప్రతి శుక్ర,పౌర్ణమి,అమావాస్య రోజున అమ్మవారికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి చీర వడిబయ్యము,బోనాలు సమర్పించి తమ మొక్కలు చెల్లించుకోవడం జరుగుతుందన్నారు.ప్రత్యేకించి ప్రతీ మంగళ,శుక్రవారము రాహుకాల సమయములో రాహుకాల పూజలు నిర్వహిస్తున్నారు. ఆలయ ప్రాంగణం మొత్తం అమ్మవారి నామస్మరణతో మార్మోగాయి. అనంతరం ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేసిన తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు ,భక్తదులందరూ పాల్గొన్నారు

## విద్యుత్ సరఫరా అంతరాయానికి సహకరించండి

**పులివెందుల - సూర్య వాస్తవం :** నేడు అనగా 21.02.2026 వ తేదీ అనగా, శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు132 కెవి పులివెందుల సబ్ స్టేషన్‌లో మరమ్మతు కార్యక్రమం వున్నందున 33/11 కెవి నల్లపురెడ్డిపల్లి, ఈ- కొత్తపల్లి, కదిరి రోడ్డు సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాలకు, వ్యవసాయ విద్యుత్ వినియోగ దారులకు సప్లైలో అంతరాయం కలుగును, కావున దయచేసి ప్రజలు, రైతులందరూ సహకరించవలసినదిగా కోరుతు న్నానమని, పులివెందుల రూరల్ విద్యుత్ ఏఈ కే.రమేష్ తెలిపారు.

# కూటమి ప్రభుత్వం వీరబాదుడు ప్రభుత్వం

### - డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి



**వేంపల్లె - సూర్య వాస్తవం :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం దంచుడు ప్రభుత్వంగా, బాదుడు ప్రభుత్వంగా, వీర బాదుడు ప్రభుత్వంగా తయారు కావడం దురదృష్టకరం, శోచనీయమని రాజ్యసభ మాజీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. శుక్రవారం వేంపల్లిలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఏరు దాటినంత వరకు ఓడ మల్లన్న, ఏరు దాటాక బోడి మల్లన్న అనే విధంగా రాష్ట్రంలో కూటమిపాలన తయారైందని ఎద్దేవా చేశారు. వైకాపా ప్రభుత్వం దంచుడు ప్రభుత్వంగా, వీర బాదుడు ప్రభుత్వంగా తయారైందని, తాము అధికారంలోకి వస్తే చార్జీలు గాని, పన్నులు గాని పెంచనే పెంచమని, ఇంకా వీలైతే తగ్గిస్తామని కూటమి పార్టీలు ఎన్నికలకు ముందు ప్రజలకు హామీ ఇచ్చాయి.ప్రజలు నమ్మి ఓట్లు వేశారు. అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం ప్లేటు ఫిరాయించడం దురదృష్టకరం. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాక అనేక రూపాలలో బాదుడు కార్యక్రమం చేస్తోంది.

1. విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో 15 485 కోట్ల రూపాయల అదనపు భారం విద్యుత్ వినియోగదారులపై మోపింది.
2. వాహనాలపై లైఫ్ టాక్స్ పై 10శాతం రహదారి భద్రతా సెస్సు.
3. ఒక్కొక్క మద్యం బాటిల్ పై అదనంగా పది రూపాయలు. ఏడాదికి 1391 కోట్ల రూపాయల అదనపు భారము మందుబాబులపై.
4. ఏపీ లాటరీ ద్వారా 3000 కోట్ల రూపాయలు.
5. ఆన్లైన్ గేమింగ్ పై పన్ను ద్వారా 1400 కోట్ల రూపాయలు.
6. స్థానిక సంస్థల వినోద్ పన్ను ద్వారా 2300 కోట్ల రూపాయలు
7. రెండు, మూడు స్థాయిల్లో అమ్మకంపై వ్యాట్ ద్వారా 1300 కోట్ల రూపాయలు
8. వృత్తి పన్ను పెంపు ద్వారా 400 కోట్ల రూపాయలు.
9. ఎస్ జి ఎస్ టి పై ఒక శాతం సెస్సు ద్వారా 4700 కోట్ల రూపాయలు.

కోడలికి బుద్ధి చెప్పి అత్తతెడ్డు నాకింది అన్న సామెతను కూటమి ప్రభుత్వం జ్ఞాపకం చేస్తోంది అని తులసిరెడ్డి ఎద్దేవా చేశారు. బాదుడు కార్యక్రమం ఇలాగే కొనసాగితే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో, సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఓటు ద్వారా కూటమి ప్రభుత్వానికి బాదు డు కార్యక్రమం ద్వారా బుద్ధి చెబుతారని తులసి రెడ్డి హెచ్చరించారు.

**రాష్ట్రంలో ప్రమాదకర స్థాయిలో ఎయిడ్స్ వ్యాధి**

రాష్ట్రంలో ప్రమాదకరస్థాయిలో ఎయిడ్స్ వ్యాధి విస్తరిస్తోందని తులసి రెడ్డి అన్నారు.రాజ్యసభలో కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ సహాయం మంత్రి అనుప్రియ పటేల్ చెప్పిన వివరాల ప్రకారం 2020 - 2024 మధ్య ఐదు సంవత్సరాలలో దేశవ్యాప్తంగా ఎయిడ్స్ వ్యాధితో ఒక్క లక్ష 81 వేల మంది మృతిచెందగా, అందులో ఆంధ్రప్రదేశ్ నుంచి 32వేల 642 మంది,తెలంగాణ నుంచి 11 498 మంది మరణించడం శోచనీయం. మొత్తం మరణాలలో ఉభయ తెలుగు రాష్ట్రాల వాటా 25%.ఐటి రంగంలో ఎయిడ్స్ వ్యాధి శరవేగంగా వ్యాప్తి చెందుతున్నదని మంత్రి చెప్పారు. ఒకప్పుడు ఎయిడ్స్ వ్యాధి పట్ల అవగాహన కార్యక్రమాలు,జాగ్రత్త చర్యలు పెద్ద ఎత్తున ఉండేవి. ఇటీవల కాలంలో అవగాహన కార్యక్రమాలు పూర్తిగా నిలిచిపోయాయి.

పర్యవసానంగా ఎయిడ్స్ వ్యాధి పట్ల జాగ్రత్తలు తీసుకోవడం తగ్గిపోయింది. వలస కార్మికుల సంఖ్య ఎక్కువ కావడం, సురక్షితం కానీ లైంగిక సంబంధాలు, ప్రభుత్వ అవగాహన కార్యక్రమాలు తగ్గడం ఇందుకు కారణం.ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా ప్రభుత్వం వెంటనే ఎయిడ్స్ వ్యాధి పట్ల అవగాహన కార్యక్రమాలు ముమ్మరం చేసి ఎయిడ్స్ వ్యాధి విస్తరణను అడ్డుకోవాలని తులసి రెడ్డి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు మల్లెం విజయభాస్కర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాద్ గౌడ్,సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి,ఉత్తన్న, తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి,నామా వినయ్ పాల్గొన్నారు.

# ప్రత్యేక అవసరాలున్న విద్యార్థినులు విద్యా కుసుమాలు

### - డైట్ కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణ






**శ్రీ సత్యసాయి బ్యూరో - సూర్య వాస్తవం :** ప్రత్యేక అవసరాలున్న విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలను చూసిన విశిష్ట అతిథులు ఆశ్చర్యపోయారు. ఈ విద్యార్థినులు నృత్యాలలో కాకుండా కళలల్లో కూడా రాణిస్తూ విద్యా కుసుమాలుగా ముందుకు పోతున్నారని ముఖ్య అతిథులు పేర్కొన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా సమగ్ర శిక్ష సహిత విద్య విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీ సత్య సాయి జిల్లా కొత్తచెరువు మైనార్టీ షాదీ మహల్ లో రెండు రోజుల పాటు జరగనున్న ఆర్ట్, సాంస్కృతిక కార్యక్రమాల ప్రారంబొత్సవ కార్యక్రమంలో ముఖ్య అతితులుగా బుక్క పట్నం డైట్ కళాశాల ప్రిన్సిపల్ రామ కృష్ణ, విద్యాశాఖ ఏడి వన్ హాజరై మాట్లాడారు. సమగ్ర శిక్ష సాహిత ఐఈడి కో ఆర్డినేటర్ డాక్టర్ ఎస్ పి పుల్లన్న ఆధ్వర్యంలో జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారం భించారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లల్లో దాగి ఉన్నటువంటి ప్రతిభను బయటకు తీయడానికి వేదికగా ఈ కార్యక్రమం జరుగుతోందని రామకృష్ణ పేర్కొన్నారు. విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ -1 శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లల అభివృద్ధి కోసం ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలను విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మెడికల్ క్యాంప్‌లు నిర్వహించి విద్యార్థి నిలకు సహాయ పరికరాలను పంపిణీ చేయడం పదవ తరగతి పరీక్షలు రాయడానికి సహాయకులను ఏర్పాటు చేయడం జరుగుతొందన్నారు. ప్రత్యేక అవసరాలు వున్నా పిల్లలలో ఉన్నటువంటి సృజనాత్మకత, ప్రతిభను బయటకు తీయడానికి ఇలాంటి కార్యక్రమాలు చాలా చక్కగా ఉపయోగ పడతాయని తెలిపారు. బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ సహిత విద్య విభాగంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ప్రత్యేక అవసరాలు గల పిల్లల అభివృద్ధికి చాలా చక్కగా కృషి చేస్తున్నారని తెలియజేశారు. సహిత విద్యా సమన్వయకర్త డాక్టర్ ఎస్పీ పుల్లన్న కార్యక్రమానికి అధ్యక్షత వహించి ప్రసంగిస్తూ ప్రత్యేక అవసరాల పిల్లలకు అనేక రకాలుగా ప్రభుత్వం చేస్తున్నటువంటి సహాయ సహకారాలను వినియోగించుకుని వారిని సమాజంలో అందరితో సమానంగా జీవితాన్ని గడపడానికి ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమం విజయవంతం చేయడానికి అన్ని రకాల ప్రయత్నాలు చేశారు. రెండు రోజుల కార్యక్రమంలో మొదటి రోజు డాన్స్, పాటల పోటీలు, డ్రాయింగ్, పెయింటింగు, క్రాఫ్ట్ లలో పోటీలు నిర్వహించారు. వీరికి శనివారం రోజు బహుమతులు ప్రధానం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి జిల్లా లోని 16 మండలాల నుండి 100 మంది ప్రత్యేక అవసరాల గల పిల్లలు, వారి తల్లిదండ్రులు, సహిత విద్యా విభాగంలో పనిచేస్తున్న ఐఈఆర్పిలు, పాఠశాల సహాయకులు మొత్తం 200 మంది కార్యక్రమంలో పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు.



## సిద్ధగుంట పంచాయతీలో సామాజిక తనిఖీ బృందం

**బాలాయపల్లి - సూర్య వాస్తవం :** మండలంలోని సిద్దాగుంట పంచాయతీలో సామాజిక తనిఖీ బృందం ఉపాధి పనులను పరిశీలించి శుక్రవారం గ్రామసభను ఉపాధి కూలీల సమక్షంలో నిర్వహించారు .ఈ సందర్భంగా సామాజిక తనిఖీ బృందం సభ్యులు మాట్లాడుతూ ఈ పంచాయతీలో మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పది రకాలైన పనులను రూ. 29 లక్షలతో నిర్వహించారని, ఈ పనులను ఈనెల 15వ తేదీ నుంచి 19వ తేదీ వరకు సామాజిక తనిఖీ బృందం నిర్వహించి సమగ్ర నివేదికను తయారు చేశారని తెలియజేశారు. ఈ పనుల వివరాలను ఉపాధి కూలీల సమక్షంలో వివరించి పలు విషయాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ పి, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు ,ఉపాధి కూలీలు ఉన్నారు.

## తహశీల్దార్‌ను కలిసిన టీడీపీ నాయకులు



**లింగాల - సూర్య వాస్తవం :** లింగాల తహశీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన రామచంద్రుని లింగాల మండల టిడిపి ఇన్‌ఛార్జి దేవి రెడ్డి సంజీవరెడ్డి టిడిపి నాయకులు శుక్రవారం ఆయన కార్యాలయంలో కలసి దుశ్శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లింగాల మండల రైతుల, ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరింపజేయాలని ఆయనను కోరారు. ఇందుకు ఆయన స్పందిస్తూ రైతుల సమస్యల ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరింప చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే మా దృష్టి తీసుకురావాలన్నారు. వాటి పరిష్కారాన్ని కూడా కృషి చేస్తామని ఆయన వారికి తెలిపారు. మండలంలోని పలు సమస్యలపై తాసిల్దార్ తో సంజీవరెడ్డి చర్చించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ నరేంద్ర, వీఆర్వో గంగాధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## సర్వజనాసుపత్రిలో సమస్యలపై
# వాణి వినిపించిన ఎమ్మెల్యే దగ్గుపాటి

- రోగులు పడుతున్న ఇబ్బందుల్ని అసెంబ్లీ వేదికగా వివరించిన ఎమ్మెల్యే
- 1200పడకలకు తగిన విధంగా బడ్జెట్, సౌకర్యాలు కల్పించాలన్న ఎమ్మెల్యే
- వివిధ దశల్లో ఆగిన నిర్మాణాలు పూర్తి చేయాలని కోరిన దగ్గుపాటి
- ఎమ్మెల్యే లేవనెత్తిన అంశాలకు వివరణ ఇచ్చిన మంత్రి సత్యకుమార్



**అనంతపురం - సూర్య వాస్తవం:** అనంతపురం జిల్లా కేంద్రంలోని పెద్దాసుపత్రిలో నెలకొన్న సమస్యల్ని, రోగులు పడుతున్న ఇబ్బందులను అసెంబ్లీ వేదికగా అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వివరించారు. శుక్రవారం జరిగిన సమావేశంలో ఉదయం పలు అంశాల గురించి వివరణ కోరారు. ముఖ్యంగా సర్వజనాసుపత్రిలో పరిస్థితులను, ఆగిన నిర్మాణాల గురించి ప్రస్తావించారు. అత్యంత వెనుకబడిన ఉమ్మడి అనంతపురం జిల్లాకు అతి పెద్ద ఆసుపత్రి ఇదేనని.. అయితే అందుకు తగిన విధంగా ఇక్కడ సౌకర్యాలు లేవన్నారు. పెరుగుతున్న జనాభా, ఆసుపత్రిలో అందిస్తున్న వినూత్న సేవల దృష్ట్యా.. ఇతర జిల్లాల నుండి కుడా రోగులు వస్తున్నారన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో 2వేల మందికి పైగా అవుట్ పేషెంట్లు, 1200మంది ఇన్ పేషెంట్లు ఉన్నారన్నారు. కానీ ప్రస్తుతం 560పడకలు గానే ఆసుపత్రి ఉందని.. అందుకే ఆసుపత్రిని 1205 పడకలకు అధికారికంగా పెంచాలని ఎమ్మెల్యే దగ్గుపాటి కోరారు. ఔషధాలు, శస్త్రచికిత్స సామగ్రి, ల్యాబ్ కెమికల్స్ కోసం తగినంత నిధులు మంజూరు చేయలేదన్నారు. డ్రగ్స్ కోసం అవసరమైన బడ్జెట్ 17.19 కోట్లు కాగా 10.88 కోట్లు మాత్రమే విడుదలవు తోందన్నారు. దీని వలన రోగులు ఇబ్బందులు పడుతున్నారని.. సర్జికల్స్ ఇతరత్రా సామాగ్రి అవసరాల కొరకు అవసరమైన బడ్జెట్ 79.35 కోట్లు కాగా 75.92 కోట్లు మాత్రమే విడుదలవుతోందన్నారు. అందుకే బడ్జెట్ ను కూడా వెంటనే పెంచాలని ఎమ్మెల్యే దగ్గుపాటి కోరారు. మాతా-శిశు బ్లాక్ నిర్మాణం కోసం 300 కోట్లు మంజూరు చేసి..600 పడకల ఎంసీహెచ్ బ్లాక్ ప్రతిపాదించారు కానీ.. ఆర్.అండ్.బి అధికారులు స్థలం హ్యాండ్ ఓవర్ చేయలేదన్నారు. ట్రామా కేర్ సెంటర్ మంజూరు చేసిన ప్పటికీ.. భవనం నిర్మాణం పూర్తయినా సిబ్బంది పోస్టులు భర్తీ చేయలేదన్నారు. సర్జికల్ బ్లాక్ నిర్మాణం జి7గా ప్రతిపాదించి నప్పటికీ ప్రస్తుతం జి1 మాత్రమే నిర్మిస్తున్నారని.. అవి కూడా 40శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయన్నారు. వీటిపై స్పందించి తగిన నిధులు మంజూరు చేసి సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కోరారు..

# ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవ వేడుకలు



**పులివెందుల - సూర్య వాస్తవం :** ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ పులివెందుల మండలం, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల (రమణప్ప సత్రం)లో శుక్రవారం థాంక్స్ గివింగ్ డే అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానో పాధ్యాయురాలు వరలక్ష్మి, మరియు ఉపాధ్యాయ బృందం అందరూ కలిసి పాఠశాలలో పని చేస్తున్న ఆయాలు, వంట ఏజెన్సీ వారిని ఘనంగా సన్మానించారు. సమానత్వం, న్యాయం, గౌరవం ఇవే సమాజాన్ని నిలబెట్టే స్తంభాలు.ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం మనందరికీ ఒక గుర్తు.ప్రతి వ్యక్తికి సమాన హక్కులు, సమాన అవకాశాలు కల్పించడం మన బాధ్యత. వివక్షలు లేని సమాజం, శ్రమకు గౌరవం, బలహీన వర్గాలకు రక్షణ ఇవి నిజమైన అభివృద్ధి సూచికలు.సామాజిక న్యాయం కేవలం ఒక ఆలోచన కాదు అది మన ఆచరణలో కనిపించాలి. సమానత్వమే సుస్థిర అభివృద్ధికి పునాది అని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మి పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం మన దగ్గర, మన కోసం పని చేసేవారిని గౌరవించాలని, వారి పట్ల కృతజ్ఞతా భావం కలిగి ఉండాలని, చిన్న వయసు నుంచే ఇలాంటి విలువలని కలిగి ఉండాలని పిల్లలకి తెలియచేయటం, పిల్లలకి ఇచ్చే ఆస్తులు, అంతస్తుల కంటే మనం నేర్పే విలువలు, సంస్కారం మాత్రమే వాళ్ళని ప్రయోజకులని చేస్తాయి అనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం చేపట్టడం జరిగింది.పిల్లలు కూడా వారికి తోచిన రీతిలో బహుమతుల రూపంలో వారి కృతజ్ఞతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పిఎస్‌హెచ్ఎమ్ వరలక్ష్మి, ఉపాధ్యాయులు సూర్యనారాయణ, సుమాంజలి, శిరీష, ఎంపిపిఎస్ అంకాలమ్మపేట ఉపాధ్యాయులు లత, రాధా రాణి, వంట సిబ్బంది, ఆయాలు, పాఠశాల విద్యార్థులు మొదలైన వారు పాల్గొన్నారు.




## ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో టైలరింగ్ శిక్షణ ప్రారంభం

**పులివెందుల - సూర్య వాస్తవం :** కళాశాలలో పీఎం ఉషా పథకం ఆధ్వర్యంలో టైలరింగ్ శిక్షణ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ బి.శ్రీనివాసులు మాట్లాడుతూ టైలరింగ్ వంటి వృత్తి నైపుణ్య శిక్షణలో విద్యార్థులకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించి ఆర్థికంగా స్వావలంబన సాధించడానికి దోహదపడుతుందని తెలిపారు. అలాగే ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సి .బాలనారాయణ మాట్లాడుతూ ఈ శిక్షణ ద్వారా విద్యార్థులలో ఆత్మవిశ్వాసం పెరిగి భవిష్యత్తులో చిన్న స్థాయి పరిశ్రమలు ప్రారంభించే అవకాశాలు మెరుగుపడతాయని చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆంజనేయులు దేరాంగుల ,అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్, వెలుగు (డిఆర్డిఏ) మాట్లాడుతూ ఈ కోర్సు శిక్షణ తరువాత ఈ సర్టిఫికెట్ ద్వారా గార్మెంట్స్ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు పొందవచ్చని మరియు ప్రభుత్వ స్కీమ్స్ ద్వారా సబ్సిడీతో కూడుకున్న లోన్స్ ను టైలరింగ్‌కు ఉపయోగపడే విధంగా బ్యాంకు ద్వారా పొందవచ్చునని తెలియజేశారు. అనంతరం ఐక్యూఎస్సీ కోఆర్డినేటర్ డాక్టర్ పి.రాధిక మాట్లాడుతూ, కళాశాలలో ఈ నైపుణ్య కోర్సు ఒక నెల రోజుల పాటు జరుగుతుందని, కోర్స్ ట్రైనర్స్ కు మరియు మిషనరీస్ అన్ని ప్రభుత్వ సహకారంతో పిల్లలకు ఉచితంగా శిక్షణకు కావాల్సిన వసతులను ఏర్పాటు చేయడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాల అధ్యాపకులు డాక్టర్ యు.శ్రీనిత, డాక్టర్ ఎస్ .సుగుణమ్మ, డాక్టర్ కే .విజయలక్ష్మి, డాక్టర్ బి. రమీజా, వాణి, ప్రవల్లిక, హేమావతి మరియు ఇతర అధ్యాపక, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా కోర్స్ ట్రైనర్స్ పార్వతి, చంద్రకళ మాట్లాడుతూ శిక్షణ విధానం, ప్రాక్టికల్ తరగతులు మరియు కోర్సు ద్వారా పొందగల నైపుణ్యాల గురించి వివరించారు. ఈ కార్యక్రమ ప్రారంభోత్సవం విద్యార్థులలో ఉత్సాహాన్ని నింపుతూ, భవిష్యత్తు ఉపాధి అవకాశాలకు దృఢమైన పునాది వేసే కార్యక్రమంగా విజయవంతంగా ముగిసింది.




## అక్రమ జూదం నిర్వహిస్తున్న వారిపై పోలీసు దాడులు



**పులివెందుల - సూర్య వాస్తవం :** కడప జిల్లా ఎస్పి నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు పులివెందుల డిఎస్పి మురళి ఆధ్వర్యంలో తేదీ 19.02.2026న సాయంత్రం 04.30 గంటల సమయంలో, పులివెందుల టౌన్ నగరిగుట్టలోని ఒక ప్రైవేట్ లాడ్జి సమీపంలో ఎస్సీ హాస్టల్ వెనుక భాగంలో ఉన్న కంపచెట్ల వద్ద ఖాళీ స్థలంలో కొంత మంది వ్యక్తులు "మంగతాయ్" అనే ఆటను డబ్బులు పందెంగా పెట్టి ఆడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు డి. హాజివల్లి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, పులివెందుల ట్రాఫిక్ యుజి పి.ఎస్ ఇన్‌చార్జ్, పులివెందుల ట్రాఫిక్ పి.ఎస్ ఆధ్వర్యంలో సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకుని దాడి నిర్వహించారు. దాడి సమయంలో నిందితులు డబ్బులు పందెంగా పెట్టి జూదం ఆడుతూ పట్టుబడ్డారు.పోలీసులు నిందితుల వద్ద నుండి రూ.40,150 నగదు, 52 ప్లేయింగ్ కార్డులు స్వాధీనం చేసుకుని పంచనామా నిర్వహించారు. ఈ ఘటనపై అదే రోజు సాయంత్రం 05.15 గంటలకు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయబడింది.ఈ కేసులో అరెస్టు చేయబడిన నిందితులు, ఆమూరు వెంకట శివా రెడ్డి, వయస్సు 33 సంవత్సరాలు, తండ్రి వెంకటస్వామి రెడ్డి, వృత్తి పెట్రోల్ బంక్ యజమాని, గాయత్రి కాలనీ, పులివెందుల టౌన్, కడప జిల్లా. వెట్టి అశోక్, పగడాల సాయి కుమార్, షేక్ సందాని (సెల్: 6302964205) ఆమూరు రమేష్ రెడ్డి, పప్పూరి సాయి మునిశ్వర రెడ్డి, నిందితులపై చట్టపరమైన చర్యలు ప్రారంభించబడినవని, పులివెందుల పట్టణంలో అక్రమ జూద కార్యకలాపాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని డి.ఎస్.పి మురళి నాయక్ తెలిపారు.

## సారా ఊటలను ధ్వంసం చేసిన పోలీసులు

**గుత్తి - సూర్య వాస్తవం :**



గుత్తి అనంతపూర్ జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు, గుంతకల్ సబ్ డివిజన్ డిఎస్పి శ్రీనివాసులు ఉత్తర్వులు మేరకు గుత్తి ఇన్‌స్పెక్టర్ రామారావు, ఎస్ఐ సురేష్ ఆధ్వర్యంలో, ఎస్ఐ అయినా నేను, సిబ్బందితో ఈ దినం మాకు రాబడిన సమాచారం మేరకు గుత్తి మండలం బసినేపల్లి తాండ గ్రామ శివారులలో సారా ఊటలను గుర్తించి వాటిని ధ్వంసం చేశారు.

## ట్రాక్టర్ మెకానిక్ లక్ష్మీ నారాయణ అనారోగ్యంతో మృతి



**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి పట్టణంలోని నమాజ్ కట్ట వద్ద నివసించే లక్ష్మీనారాయణ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. వీరి మృతి పట్ల గుత్తి, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి నజీర్, టీడీపీ, సీనియర్ నాయకులు, సుధాకర్, చెర్లోపల్లి మాజీ కౌన్సిలర్ వేణు, సాధన స్కూల్, ప్రిన్సిపల్, పిల్లేల్లి కృష్ణ, వారి మిత్ర బృందం నివాళులర్పించారు. మృతి పట్ల వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలియజేశారు

## ఏపీ మోడల్ స్కూల్లో 6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

**లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం:** ఏపీ మోడల్ స్కూల్లో 2026- 27 విద్యా సంస్థలకు సంబంధించిన ఆరో తరగతి ప్రవేశం కొరకు ఈనెల 23 నుంచి దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వరాల రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఈనెల 23 నుంచి మార్చి 31 వరకు దరఖాస్తులు ఆన్లైన్ ద్వారా చేసుకోవచ్చున్నారు. ఆన్లైన్ కు విద్యార్థి చదువుతున్న స్టడీ సర్టిఫికెట్ తల్లితండ్రులు మరియు విద్యార్థి ఆధార్ కార్డు నెంబర్లు ఆన్లైన్ లో పొందుపరచాల న్నారు. ఎస్సీ ఎస్టీలకు 125 రూపాయలు బీసీ ఓసీలకు 200 రూపాయలు ఆన్లైన్ ద్వారా ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఏప్రిల్ 12వ తేదీన ఆదివారం ఏపీ మోడల్ స్కూల్లో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చున్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఏపీ మోడల్ స్కూల్ లో అప్పగించాలన్నారు. వివరాలు కోసం 7780624220 నెంబర్ ని సంప్రదించమన్నారు.

## శివరామిరెడ్డికి ఘన నివాళులు

**- మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పరామర్శ**



**నాయుడుపేట - సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలం కప్పకుంట కండ్రిగ గ్రామానికి చెందిన వైఎస్సార్సీపీ నాయకులు సతీష్ రెడ్డి తండ్రి శివరామిరెడ్డి మృతి చెందారు. ఈ వార్త తెలుసుకున్న మాజీ సూళ్లూరుపేట శాసనసభ్యులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గ సమన్వయకర్త కిలివేటి సంజీవయ్య శుక్రవారం గ్రామానికి చేరుకుని పార్థివ దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డితో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం శివరామిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించిన కిలివేటి సంజీవయ్య, సతీష్ రెడ్డికి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు శివరామిరెడ్డి సేవలను స్మరించుకున్నారు. గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది.

## అగ్ని ప్రమాద బాధితులను ఆదుకున్న దాతలు

**బ్రహ్మంగారిమఠం - సూర్య వాస్తవం:** మండల కేంద్రంలోని బద్వేల్ రోడ్డులో ఆంజనేయ స్వామి గుడి సమీపంలో నివాసం ఉంటున్న నాగులూరు వెంకటేష్ కు చెందిన గుడిసె ప్రమాదం శాతం గురై ఇంట్లో ఉండే అన్ని సామాన్లు ఇంట్లో బీరువాలో ఉన్న విలువైన వస్తువులు, రూ.20వేల నగదు, ఫ్రిడ్జ్, కూలర్, పాములు పట్టుకునే తట్టలు దగ్ధమయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న కొంతమంది దాతలు రూ.12వేల నగదు రెండు మూటల బియ్యం, చీరలు అందజేశారు. అలాగే దాతలు ఎవరైనా ఉంటే ముందుకు వచ్చే సహాయం చేయవలసిందిగా కోరుచున్నారు. అలాగే రెవెన్యూ వారు పరిశీలించారు.



# సంపద పంపిణీలో సామాజిక న్యాయం పాటించాలి

**- కుల మత లింగ వివక్షతను కొనసాగిస్తున్న మోడీ ప్రభుత్వం**
**- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య**




**వెంకటగిరి– సూర్య వాస్తవం:** దేశంలో ప్రజాస్వామ్యం వర్ధిల్లాలి అంటే సంపద పంపిణీలో సామాజిక న్యాయం పాటించాలని కానీ కేంద్రంలో ఉన్న ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం కు సామాజిక న్యాయం అంటేనే గిట్టదని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య మాట్లాడారు. శుక్రవారం సామాజిక న్యాయం అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి పిలుపుమేరకు వెంకటగిరి పట్టణంలో అడ్డరోడ్ సెంటర్ వద్దఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అంటేనే బిలియనీర్ల ప్రభుత్వంగా మార్చేశాడని కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఉంటూ అనేక రకాల పన్ను





రాయితీలు ఇస్తూ దేశాన్ని ఆర్థికంగా దివాలా దీస్తున్నాడని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశించిన సాంఘిక న్యాయం స్వేచ్ఛ సమానత్వం కార్పొరేట్ల విధానాలతో ప్రమాదంలో పడిందని దేశ ప్రధాని నరేంద్ర మోడీ 12 ఏళ్ల పాలనలో ప్రజాస్వామ్యం కూడా ప్రమాదంలో పడిందన్నారు. దేశ సంపద అంతా 46% సంపద ఒక్కరి చేతిలో పోగు పడిందని 10% మంది దగ్గర 75% సంపద పోగు పడిందని మోడీ ప్రభుత్వం అంటేనే బిలియనీర్ల ప్రభుత్వంగా మారి పోయిందన్నారు ప్రజాస్వామ్యం లేని అరాచక పాలనకు దారితీసిందని మతోన్మాదం పెంచి పోషిస్తున్నదని భారత రాజ్యాంగాన్ని అనేక రకాల ఇబ్బందులకు గురి చేయడానికి మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని తీవ్రంగా మండిపడ్డారు. విమానాశ్రయాలు పోర్టులు గనులు సహజవాయువు నిక్షేపాలు కార్పొరేట్లకు కట్టబెట్టి అందుకు ప్రతిఫలంగా వారు బిజెపికి వేల కోట్లు ఎన్నికల నిధులు ఇస్తున్నారని కార్పొరేట్ల సహకారంతో బిజెపి అధికారాన్ని మోడీ పాలన సహకారంతో కార్పొరేట్లు దేశ సంపదను సొంతం చేసుకుంటున్నారని తీవ్రంగా విమర్శించారు. ఉన్నత విద్యాలయాల్లో ఐదేళ్లుగా కుల వివక్ష 118 శాతానికి పెరిగిపోయిందని అధికారిక లెక్కల ప్రకారం 1100 కు పైగా కుల వివక్ష కేసులు నమోదయ్యాయని అనధికారికంగా వాటికి ఐదు రెట్లు ఉండొచ్చని ఆయన అభిప్రాయపడ్డారువిమర్శించారు. సామాజిక న్యాయం కోసం పోరాటం అంటే కార్పొరేట్ల దగ్గర పోగుపడ్డ సంపద పునః పంపిణీ కోసం జరిగే పోరాటం గా ఆయన అభివర్ణించారు. సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి పల్లెపాటి బాలకృష్ణయ్య మాట్లాడుతూ మోడీ చెబుతున్న వికసిత్ భారత్లో పేదలు లేరని పేదల ఉపాధి హక్కును సంక్షేమ పథకాలలో కత్తిరించారని నిరుద్యోగాన్ని అధిక ధరల భారాన్ని ప్రజలపై మోపారని కష్టజీవులకు గ్రామీణ పేదలకు తోడ్పాటు ఇచ్చే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నారని ఘాటుగా విమర్శించారు .సంపద అంతా అందరికీ సమానంగా పంపిణీ చేసి సామాజిక న్యాయం పాటించాలని లేకుంటే సామాజిక న్యాయం స్వేచ్ఛ సమానత్వం కోసం మతోన్మాద బీజేపీ ప్రభుత్వంతో నిరంతరం ఎర్రజెండా నాయకత్వంలో పోరాటం కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు కల్లూరు జాన్ నియోజకవర్గ నాయకులు ముని కృష్ణారెడ్డి కచేపల్లి అంకయ్య ప్రసాద్ జయకృష్ణ గురవయ్య మురళి శీను గురవయ్య పద్మమ్మ జ్యోతి వాణి అంకమ్మ నాగరాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

# సోమిరెడ్డికి ఆత్మీయ ఆహ్వానం...

**- ఘన సన్మానాలతో ఎమ్మెల్యేకు నాయకుల నీరాజనం**
**- మాజీ ఎంపీ నివాసంలో రాజకీయ సందడి**
**- టీడీపీ శ్రేణుల ఉత్సాహం**

**నాయుడుపేట - సూర్య వాస్తవం:** సర్వేపల్లి ఎమ్మెల్యే, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి శుక్రవారం నాయుడుపేట పట్టణంలో ఆత్మీయ వాతావరణంలో సందర్శన చేశారు. నెల్లూరు నుండి రేణిగుంట విమానా శ్రయానికి వెళ్తూ మార్గమధ్యంలో మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే తెలుగుదేశం సూళ్లూరుపేట నియోజకవర్గం ఇంచార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం నివాసానికి విచ్చేయడంతో పట్టణంలో రాజకీయంగా చురుకుదనం నెలకొంది. సోమిరెడ్డి రాక సందర్భంగా నివాసం వద్ద తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున చేరుకుని ఘన స్వాగతం పలికారు. మాజీ ఎంపీ మాజీ ఎమ్మెల్యే తెలుగుదేశం సూళ్లూరుపేట నియోజకవర్గం ఇంచార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం, సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయ శ్రీ కలిసి శాలువాలు కప్పి పూలమా లలతో సన్మానించారు. ఆత్మీయంగా కుశల ప్రశ్నలు అడిగి పాత రాజకీయ అనుభవాలను నెమరువేసుకున్నారు. భేటీ సందర్భంగా రాష్ట్ర రాజకీయ పరిణామాలు, రానున్న రాజకీయ వ్యూహాలు, ప్రజా సమస్యలు, ప్రాంతీయ అభివృద్ధి కార్యక్రమాలపై సుదీర్ఘంగా చర్చించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ముఖ్యంగా గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధి, సాగునీటి సమస్యలు, ఉపాధి అవకాశాల విస్తరణ వంటి అంశాలపై అభిప్రాయాలు పంచుకున్నట్లు సమాచారం. అనంతరం





టిడిపి నాయకులు శాలువాలు, పూలమాలలతో ఘన సత్కారం నిర్వహించారు. నాగిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, నాయుడుపేట పట్టణ టిడిపి అధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, శ్రీ పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నానబాల సుబ్బారావు, పసల గంగా ప్రసాద్, మైలారి రాజశేఖర్, గాలి రమేష్ నాయుడు, గూడూరు సుధీర్ రెడ్డి, నిత్యా కృష్ణారెడ్డి, బల్లి ముత్యాలయ్య తదితరులు పాల్గొని అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ, నెలవల సుబ్రహ్మణ్యం గారితో నాకున్న స్నేహం ఎప్పటికీ గుర్తుండిపోతుంది. సూళ్లూరుపేట అభివృద్ధి కోసం ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయ శ్రీ చేస్తున్న కృషి అభినందనీయం. భవిష్యత్తులో కూడా అందరూ అండగా నిలవాలి అని ఆకాంక్షించారు. రాజకీయాల కంటే విలువలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారానే ప్రజల విశ్వాసం నిలుస్తుందని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం తమ ప్రధాన బాధ్యత అని తెలిపారు.

కార్యక్రమంలో పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు పాల్గొని తమ నాయకుడికి మద్దతు ప్రకటించారు. సమావేశం మొత్తం స్నేహపూర్వక, ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. దశాబ్దాలుగా కొనసాగుతున్న పరస్పర గౌరవం, అనుబంధం మరోసారి ప్రతిఫలించిన ఈ భేటీ నాయుడుపేట రాజకీయాల్లో ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకుంది.

# చెప్పి రండి..... చూసుకుందాం...!

**- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనారిటీ అధ్యక్షులు, అనంతపురం సమన్వయకర్త దాదా గాంధీ**
**- కాంగ్రెస్ పార్టీ కార్యాలయంపై బిజెపి యువ మోర్చా దాడిని ఖండించిన ఇండియా కూటమి నాయకులు..**

**అనంతపురం – సూర్య వాస్తవం :** కాంగ్రెస్ పార్టీ కార్యాల యంపై బిజెపి దాడిని ఇండియా కూటమి నాయకులు తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనారిటీ అధ్యక్షులు, అనంతపురం సమన్వయకర్త దాదా గాంధీ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం






నిర్వహించిన నాయకులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

ఈ సందర్భంగా దాదా గాంధీ మాట్లాడుతూ...

భారతీయ జనతా పార్టీ కాదు బ్రిటిష్ జనతా పార్టీ అని సంబోధిస్తున్నానన్నారు. ఢిల్లీలో ఏదో జరిగిందని గల్లీలో గల్లీ నాయకులందరూ కలిసి దాడికి పాల్పడడం ఏంటని ప్రశ్నించారు. ఎవరు లేనప్పుడు కాదు చెప్పి వస్తే ఎవరు ఏమిటో తెలుస్తుందని బిజెపి నాయకులపై తీవ్రస్థాయిలో గాంధీ మండిపడ్డారు.. కేవలం పదిమంది రౌడీ నాయకులు పోలీసుల సమక్షంలోనే దాడులకు పాల్పడ్డారని పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం నిరసన కార్యక్రమాల్లో ఒక దిష్టిబొమ్మ కాలుస్తుంటే పట్టుకొని అరెస్టు చేసే పోలీసులు పార్టీ కార్యాలయం పై దాడికి పాల్పడుతుంటే ఏం చేస్తున్నారు .. ఇదేనా మీరు చెప్పే ప్రజాస్వామ్యం అంటూ ఆయన ప్రశ్నించారు. టూ టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయను న్నామని, పోలీసులు చర్యలు తీసుకోకపోతే దేశవ్యాప్తంగా నిరసన కార్య క్రమాలు చేపడతామని దాదా గాంధీ తెలిపారు. భారతీయ జనతా పార్టీ యువ మోర్చా నాయకులను చేసిన దాడిని సిపిఐ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని ఆ పార్టీ నాయకులు శ్రీరాములు, నారాయణస్వామి పేర్కొన్నారు. ఢిల్లీలో ఏదో జరిగిందని ఇక్కడ దాడులు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఒక సీటు ఉన్న భారతీయ జనతా పార్టీ నేడు 270 స్థానాల తో అధికారంలో ఉందని అప్పటి కాంగ్రెస్ పార్టీ ఇలా దాడులు చేసి ఉంటే మీరు అధికారంలోకి వచ్చేవారా అంటూ ప్రశ్నించారు. బిజెపి నాయకులు వెంటనే క్షమాపణ చెప్పాలని, పోలీసులు వెంటనే కేసులు నమోదు చేసి దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయాలన్నారు. లేనియెడల రానున్న రోజుల్లో పోరాటం చేస్తామన్నారు.

# అసంపూర్ణ వంతెనల పూర్తికి మంత్రి హామీ!

**- రైల్వే బ్రిడ్జిలపై కాలవ ప్రస్తావన**



**రాయదుర్గం– సూర్య వాస్తవం:** రాయ దుర్గం పట్టణంలో అర్ధాంతరంగా ఆగిపో యిన రైల్వే వంతెనలను పూర్తి చేస్తా మని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి హామీ ఇచ్చారు. రాష్ట్ర అసెంబ్లీలో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు శుక్రవారం రాయ దుర్గంలో అసంపూ ర్ణంగా ఉన్న రైల్వే బ్రిడ్జిల గురించి ప్రస్తా వించారు. గత తెలుగు దేశం ప్రభుత్వంలో చేపట్టిన సదరు వంతెనలు అర్ధాంతరంగా ఆగి పోయాయన్నారు. వైకాపా ప్రభుత్వం వీటి గురించి ఏమాత్రం పట్టించుకోక పోవడంతో నేడు దిష్టి బొమ్మల్లా దర్శనమిస్తు న్నాయని ఆందోళన వ్యక్తపరిచారు. రాయదుర్గం నుండి అనంతపురం, కనేకల్లుకు వెళ్ళే ప్రధాన రహదారుల్లో రెండు వంతెనలు అసంపూర్తిగా మిగిలిపోయాయన్నారు. వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని కేంద్ర రైల్వే శాఖ మంత్రి దృష్టికి కూడా తీసుకెళ్లామన్నారు. అనంతపురం వెళ్లే రహదారి జాతీయ రహదారి నెంబర్ 544 డిడిగా గుర్తించడంతో వన్ టైం ఇంప్రూమెంట్ కింద చేపట్ట వచ్చని సూచించడంతో రూ.51.75 కోట్లతో ప్రతిపాదనలు పంపడం జరిగింద న్నారు. రాష్ట్ర రోడ్డు భవనాలు శాఖ మంత్రి తన పలుకుబడి ఉపయోగించి ఈ పనిని జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ ద్వారా పూర్తి చేయించాలని కోరారు. ఎమ్మెల్యే విన్నపంపై మంత్రి జనార్దన్ రెడ్డి స్పందిస్తూ, రాష్ట్రంలో అసంపూర్తిగా మిగిలిపోయిన వంతెనల ప్రతిపాదనలు పంపాలని ప్రభుత్వం ఆదేశం చిందన్నారు. చాలా చోట్ల 70 నుండి 90 శాతం పనులు పూర్తయి అర్ధాంతరంగా ఆగిపోయాయ న్నారు. ప్రభుత్వం నుండి అనుమతులు తీసుకొని త్వరలో వాటిని పూర్తి చేయి స్తామన్నారు. రాయదుర్గం బ్రిడ్జి పనులు కూడా పూర్తి చేయిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

# తిరుపతి జిల్లాలో ఎస్ఐల బదిలీలు

**- సూళ్లూరుపేటకు అజయ్ కుమార్**
**- నాయుడుపేటకు బ్రహ్మనాయుడు నియామకం**



**నాయుడుపేట– సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లాలో పోలీసు శాఖలో బదిలీలు చేపట్టారు. జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో ఎస్సై స్థాయిలో మార్పులు చోటు చేసుకున్నాయి. సూళ్లూరుపేట పోలీస్ స్టేషన్లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న బ్రహ్మ నాయుడును నాయుడుపేట పోలీస్ స్టేషన్కు బదిలీ చేశారు. అదే విధంగా దొరవారిసత్రం పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న ఎస్ఐ అజయ్ కుమార్ను సూళ్లూరుపేట నూతన ఎస్సైగా నియమించారు. అలాగే తిరుపతి కార్యాలయంలో వీఆర్లో ఉన్న జీవి చౌదరిని దొరవారిసత్రం పోలీస్ స్టేషన్కు ఎస్ఐగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ కార్యాలయం నుండి అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి. బదిలీ అయిన అధికారులు త్వరలోనే తమ తమ స్టేషన్లలో బాధ్యతలు స్వీకరించనున్నారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఈ మార్పులు చేపట్టినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి.

# 9 మంది జూదరులు అరెస్ట్

**- సీఐ టీ.నరసింహులు**

**వేంపల్లె - సూర్య వాస్తవం:** జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, పులివెందుల డిఎస్పి కే.మురళి నాయక్ ఆధ్వర్యంలో వేంపల్లి స్థానిక వేంపల్లి పట్టణం లోని రాజీవ్ నగర్ కాలనీకి ఉత్తరం దిక్కున పబ్లిక్ స్థలంలో డబ్బులు వెచ్చించి మంగతాయ్ మరియు లోపల బయట ఆడుతున్న తొమ్మిది మందిని అరెస్టు చేసినట్టు సిఐ టీ.నరసింహులు వెల్లడించారు. వారి దగ్గర నుండి 27,100 రూపాయలు నగదు, 52 పేక ముక్కలు ప్రొసెడింగ్స్ ద్వారా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్టు వెల్లడించారు. జూదం ఆడుతున్న తొమ్మిది మంది వేంపల్లి పట్టణ చుట్టుపక్కల ప్రాంతాల రైతులు మరియు రోజువారి కూలీలుగా గుర్తించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ తయ్యార్ హుస్సేన్, ఎస్సై ఈ.త్రిపాల్ నాయక్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# జీరో లిట్టర్ గవర్నెన్స్‌పై అవగాహన

**- మున్సిపల్ కమిషనర్ మునికుమార్**




**పులివెందుల - సూర్య వాస్తవం :** స్వర్ణాంధ్ర– స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వ ర్యంలో చేపడుతున్న జీరో లిట్టర్ గవర్నెన్స్ పై అవగాహన కార్యక్రమాలను విజయ వంతం చేయాలని పులివెందుల మున్సిపల్ కమిషనర్ ముని కుమార్ ప్రజలకు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమాలలో భాగంగా శనివారం ఉదయం 9 గంటలకి పులివెందులలోని మెప్మా కార్యాలయం వద్ద మున్సిపల్ చైర్ పర్సన్, ఇతర అధికారులు ప్రజల ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలలో భాగంగా ఆంధ్రప్రదేశ్ అందాన్ని మరింత అందంగా తీర్చిదిద్దేందుకు అవలంబించవలసినటువంటి విధివిధానాలను ప్రజలకు మరింత అవగాహన కల్పించేందుకు చేపడుతున్న ఈ కార్యక్రమాలను ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమ విజయవంతనికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ముని కుమార్ పిలుపునిచ్చారు.

## హాలీవుడ్ నటుడు
# ఎరిక్ డేన్ కన్నుమూత



గేస్ అనాటమీ, యుఫోరియా చిత్రాల ద్వారా గుర్తింపు పొందిన హాలీవుడ్ నటుడు ఎరిక్‌డేన్ (53) కన్నుమూశారు. గతేడాది కాలంగా (మోటార్ న్యూరాన్ వ్యాధి)తో పోరాడుతున్న ఆయన గురువారం మరణించినట్లు కుటుంబ సభ్యులు ధృవీకరించారు. 'డాక్టర్ మెక్సీ'గా పాపులర్ అయిన ఆయన, తన చివరి రోజుల్లో ఈ వ్యాధిపై ప్రజలకు కొంతమేరకు అవగాహన కల్పించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. హాలీవుడ్‌కు చెందిన సినీరంగ ప్రముఖులు ఎరిక్‌డేన్ మృతికి తీవ్ర సంతాపం తెలిపారు.ఆన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## స్పెషల్ అవార్డ్స్ జ్యూరీ
# కమిటీ చైర్మన్‌గా తమ్మారెడ్డి



'తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్' 2025కు సంబంధించి జ్యూరీ కమిటీలో కీలక మార్పు చోటుచేసుకుంది. స్పెషల్ అవార్డ్స్ జ్యూరీ కమిటీ చైర్మన్‌గా ప్రముఖ సినీ నిర్మాత, దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

గతంలో ఈ కమిటీ చైర్మన్‌గా ఉన్న ప్రముఖ దర్శకుడు కె. రాఘవేంద్రరావు స్థానంలో తమ్మారెడ్డి భరద్వాజను నియమిస్తూ జనరల్ అడ్మినిస్ట్రేషన్ విభాగం జీవో విడుదల చేసింది. తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ పంపిన నివేదికను పరిశీలించిన అనంతరం ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

ఫిబ్రవరి 4న విడుదల చేసిన మునుపటి ఉత్తర్వులకు సవరణగా ఈ కొత్త ఉత్తర్వులు వెలువడ్డాయి.

# 'టాక్సిక్' టీజర్ విడుదల



గీతు మోహన్‌దాస్ దర్శకత్వంలో యష్ నటించి 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్' టీజర్ విడుదలైంది. తమిళ చిత్రం జన నాయగన్ వెనుక ఉన్న బ్యానర్ అయిన కెవిఎన్ ప్రొడక్షన్స్ లో ఈ చిత్రం నిర్మించారు.

ఈ టీజర్ "ఈ యుద్ధం భిన్నంగా ఉంటుంది" అని అంటూ మొదలైతుంది. "నువ్వు ప్రపంచానికి వ్యతిరేకంగా వెళ్లి బ్రతకలేవు. వదులుకో, రాయ." అంటూ ఇచ్చిన వాయిస్ ఓవర్ అనంతరం హింసాత్మక సన్నివేశాలతో టీజర్ నడుస్తుంది. యష్ మద్యం తాగి ఒక వ్యక్తి తలపై క్రూరంగా కొడుతూ కనిపిస్తాడు.

పేలుళ్లు, తుపాకీ కాల్పులు, నరికివేయడం మరియు గూండాలు కొట్టబడటం ఇలా హింసాత్మక సన్నివేశాలతో టీజర్ ఉంది. ఈ చిత్రం మార్చి 19, 2025న విడుదల కానుంది.



## నేటినుంచి
# సూపర్-8 మ్యాచ్‌లు





### - పాకిస్తాన్ ఐ న్యూజిలాండ్ ఢీ
### - లీగ్ దశ దాటని ఆసీస్, ఆఫ్ఘన్

ముంబయి: ఆస్ట్రేలియా, ఒమన్ జట్ల మధ్య పల్లెకెలె వేదికగా శుక్రవారం జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌తో 9వ ఐసిసి టి20 ప్రపంచకప్-2026 లీగ్ మ్యాచ్‌లు ముగిసాయి. టి20 ప్రపంచకప్ మాజీ ఛాంపియన్ ఆస్ట్రేలియా, సంచలన ఆఫ్ఘనిస్తాన్ ఈసారి సూపర్-8కు చేరడంలో విఫలమయ్యాయి. ఇక కరేబియన్ జట్టు జింబాబ్వే ఈసారి మెగా టోర్నీలో అంచనాలకు మించి రాణించింది. ఆ జట్టు ఆస్ట్రేలియాతోపాటు, ఆతిథ్య శ్రీలంకను ఓడించి గ్రూప్ టాపర్‌గా నిలిచింది. ఫిబ్రవరి 6న 20 జట్లతో ప్రారంభమైన 2026 టి20 ప్రపంచకప్ టోర్నీ టైటిల్ రేసులో 8జట్లు మాత్రమే ముందజ వేసాయి. 12జట్లు లీగ్ దశలోనే నిష్క్రమించాయి. ఆ ఎనిమిది జట్లను గ్రూప్-1, గ్రూప్-2గా విభజించగా.. గ్రూప్-1లో భారత్, వెస్టిండీస్, జింబాబ్వే, దక్షిణాఫ్రికా, గ్రూప్-2లో పాకిస్తాన్, ఇంగ్లండ్, శ్రీలంక, న్యూజిలాండ్ జట్లు ఉన్నాయి. ప్రతి గ్రూప్ టాప్-2 జట్లు సెమీస్‌కు చేరనుండగా.. మార్చి 4, 5 తేదీల్లో సెమీఫైనల్స్, 8 ఆదివారం ఫైనల్ మ్యాచ్ జరగనుంది.పల్లెకెలె వేదికగా శుక్రవారం జరిగిన గ్రూప్-బి చివరి లీగ్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా జట్టు 9 వికెట్ల తేడాతో ఒమన్‌ను చిత్తుచేసింది. ఒమన్ 16.2ఓవర్లలో 104పరుగులకు ఆలౌట్ కాగా.. ఆ లక్ష్యాన్ని ఆసీస్ జట్టు 9.4ఓవర్లలో వికెట్ కోల్పోయి 108పరుగులు చేసి గెలిచింది.

## ఫైనల్‌కు
# ఇండియా-ఎ మహిళలు

### - కెప్టెన్ రాధా ఆల్‌రౌండ్ ప్రదర్శన
### - సెమీస్‌లో శ్రీలంకపై గెలుపు
### - ఎసిసి మహిళల ఆసియాకప్ రైజింగ్ స్టార్స్




బ్యాంకాక్: ఎసిసి మహిళల ఆసియాకప్ రైజింగ్ స్టార్స్ క్రికెట్ ఫైనల్లోకి భారత జట్టు దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన తొలి సెమీస్‌లో భారతజట్టు ఐదు వికెట్ల తేడాతో శ్రీలంక మహిళలపై ఘన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక జట్టు 118పరుగులకు ఆలౌట్ కాగా.. ఆ లక్ష్యాన్ని భారత్-ఎ కేవలం 5వికెట్లు కోల్పోయి సునాయాసంగా ఛేదించింది. కెప్టెన్ రాధా యాదవ్ కేవలం 19పరుగులిచ్చి 4వికెట్లు పడగొట్టగా.. తనూజా కన్వార్, ప్రేమ రావత్ రెండేసి వికెట్లతో రాణించారు. ఛేదనలో భాగంగా భారత బ్యాటర్లు వ్రిందా దినేశ్(42)కి తోడు రాధా యాదవ్(31నాటౌట్) రాణించారు. దీంతో భారత్-ఎ మహిళలజట్టు కేవలం 5వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని సునాయాసంగా ఛేదించింది. కెప్టెన్ రాధా యాదవ్ ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబర్చి భారతజట్టు గెలుపులో కీలకపాత్ర పోషించింది. దీంతో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు రాధాకు లభించింది. మరో సెమీస్‌లో బంగ్లాదేశ్-ఎ మహిళలజట్టు పాకిస్తాన్ మహిళలజట్టును ఓడించి ఫైనల్‌కు చేరింది. ఆదివారం భారత్-ఎ, బంగ్లాదేశ్-ఎ జట్ల మధ్య టైటిల్ పోరు జరగనుంది.


- మెడికల్ కాలేజీలో ముదిరిన నకిలీ నియామకాల వివాదం
- ప్రిన్సిపాల్, అసిస్టెంట్ డైరెక్టర్‌పై తీవ్ర ఆరోపణల వెల్లువ
- చర్యలు తీసుకోకుండా ఉండేందుకు పది లక్షలకు బేరం..?
- ఓబులేసు, మూర్తిపై అక్రమ నియామకాలపై చర్యలు శూన్యం
- అధికారులు అమ్ముడుపోయినట్లు అనుమానాలు?
- రోస్టర్ సరిచేయకుండానే నియామకాలు కొనసాగిస్తే భవిష్యత్‌లో నియామకాలు రద్దయ్యే పరిస్థితి వస్తే బాధ్యత ఎవరిది?
- కళాశాల ప్రిన్సిపాల్‌పై కేసులు నమోదు చేయాలని డిమాండ్
- తప్పులు చేసి తప్పించుకొనేకి ప్రయత్నిస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్
- నోటిఫికేషన్ అభ్యంతరాలపై స్పీకింగ్ ఆర్డర్స్ ఇవ్వకుండా కౌన్సిలింగ్ కొనసాగింపు
- నిరుద్యోగుల తరుపున గళం విప్పిన ఏఐఎస్బీ రాష్ట్ర కార్యదర్శి పాపిరెడ్డి పల్లి పృథ్వీ తదితర బృందం
- జిల్లా కలెక్టర్‌ను బురిడీ కొట్టించి నియామకాల కొనసాగింపు
- సంబంధం లేదు అంటూ ప్రస్తుత నోటిఫికేషన్‌లో చేతివాటం ప్రదర్శించేందుకు సిద్ధమైన ఆఫీస్ సూపరిండెంట్
- గతంలోనే ఈయనపై పదుల సంఖ్యలో అభియోగాలు
- అర్హులైన నిరుద్యోగులకు న్యాయం చేయడమే మా లక్ష్యం
- ఏఐఎస్బీ రాష్ట్ర కార్యదర్శి పాపిరెడ్డి పల్లి పృథ్వీ

# నకిలీ గాళ్ల మాయ

**అనంతపురం టౌన్ - సూర్య వాస్తవం:**

అనంతపురం జిల్లా ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఔట్‌సోర్సింగ్ మరియు కాంట్రాక్ట్ నియామకాల గొడవలు తారా స్థాయి కి చేరాయి భారీ అక్రమాలు జరిగినట్లు ఆధారాలు ఉన్నాకూడా కాలేజీలో అక్రమాలపై నోరు మెదపని ప్రిన్సిపాల్ విజయశ్రీ . 2007 లో ఉద్యోగం పొంది 2010 విద్యార్హత సాధించిన ఓబులేసు పై నేటికి కూడా తొలగింపు చేపట్టలేదు . ఆధారాలు అన్ని సమర్పించినా కూడా పదిహేను రోజులుగా మౌనం. ఓబులేసు తో లోపాయకారి ఒప్పందం కుదుర్చుకుని 2 లక్షలు వసూలు చేసినట్లు అనుమానాలు వ్యక్తం అవు తున్నాయి. తెలంగాణ రాష్ట్ర వాసి అయిన మూర్తి అనే ల్యాబ్ టెక్నీషియన్‌కు లోకల్ కాండిడేట్ లోకల్ జోన్ కాకపోయినా అక్రమంగా ఉద్యోగం . నేటికి బహిర్గతం అయిన కూడా తప్పులను కొనసాగించే విధంగా కళాశాల అధికారులు. కనీసం ఆర్డర్ కాపీ లు కూడా లేవు. చర్యలు శూన్యం. నేటికి 15 రోజులు గడుస్తున్నా ఈ ఇద్దరు అక్రమ ఉద్యోగులపై చర్యలు తీసుకోవడానికి నిరాకరిస్తున్న ప్రిన్సిపాల్ మరియు ఏ డి కాసులకు కక్కుర్తి పడి నిరుద్యోగులకు న్యాయం చేయకుండా అక్రమ నియామకాల ఓబులేసు , మూర్తి పై చర్యలు తీసుకోవడం లేదని నిరుద్యోగుల ఆవేదన వెల్లు వెత్తుతున్నాయి. రోస్టర్ పాయింట్లు పాటించకుండా, ప్రభుత్వ నిబంధనలను పక్కనపెట్టి నియామకాలు చేపట్టినట్లు బాధితులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు.

2019 కంటే ముందు జరిగిన నియామకాలలో జిల్లా కలెక్టర్ జారీ చేసిన మార్గదర్శకాలు (ఫైల్ నా: DEEATP-EST-TOP/459/2018- జేఏ 1- డీఈవో - ఏటీపీ, రెఫెర్ Point No: 18) అమలు చేయకుండా నియామకాలు జరిగాయని ఆధారాలతో ఆరోపిస్తున్నారు. అప్కాస్ విలీనంలో కీలక పాత్ర పోషించిన ప్రస్తుత ఏడి అంటూ ఆధారాలు పొందుపరిచారు. ఈ అంశంపై హైకోర్టు తీర్పులు ( డబ్ల్యూ పి నెంబర్: 46531 శీట 2018, డబ్ల్యూ పి నంబర్ : 18988 of 2014) కూడా ఉన్నాయని వారు పేర్కొంటున్నారు. అదేవిధంగా 2019లో ఆప్కాస్ విలీనం సమయంలో ( సర్క్యులర్ . జి ఏ డి 01-ఎస్ యు ఓ ఏం ఐ ఎస్ సీ /31/2019-SU-I, Dt: 20.11.2019) ప్రభుత్వం నిర్దేశించిన రోస్టర్ విధానం అమలు చేయకుండా సుమారు 100 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను విలీనం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. పాత ఉద్యోగుల R O R రోస్టర్ సరిచేయకుండా, 2021 నుండి కొత్త నోటిఫికేషన్లలో రోస్టర్ సైకిల్ మళ్లీ మొదటి పాయింట్ నుండి ప్రారంభించడం చట్టవిరుద్ధమని బాధితులు అంటున్నారు. ఇది భవిష్యత్‌లో నియామకాలు పొందే అభ్యర్థుల జీవితాలను చట్టపరమైన ప్రమాదంలోకి నెట్టే అవకాశం ఉందని వారు హెచ్చరిస్తున్నారు.




ఈ విషయంపై పలుమార్లు విన్నపాలు చేసినప్పటికీ, తమ గ్రీవెన్స్‌పై స్పీకింగ్ ఆర్డర్స్ ఇవ్వకుండా 20-02-2025 మరియు 21-02-2025 తేదీల్లో కౌన్సిలింగ్ నిర్వహించడం తీవ్ర అనుమానాలకు తావిస్తున్నదని ఆరోపిస్తున్నారు.నేడు ఏఐఎస్బి రాష్ట్ర కార్యదర్శి పృథ్వీ తదితర బృందం ఉదయం ప్రిన్సిపాల్ ను కలువగా నిర్లక్ష ధోరణిగా వ్యవహరిస్తూ స్పీకింగ్ ఆర్డర్స్ కావాలంటే జిల్లా కలెక్టర్ అప్రూవల్ లేకుండా ఇప్పుడు ఇస్తాము అని పొంతనలేని సమాధానాలు ఇచ్చారు. కాలేజీ ప్రిన్సిపాల్, అసిస్టెంట్ డైరెక్టర్ వ్యవహారంపై అవినీతి అనుమానాలు వ్యక్తమవు తున్నాయని, పూర్తి స్థాయి స్వతంత్ర విచారణ జరిపి నిజానిజాలు వెలుగులోకి తేవాలని 22 మంది సంతకాలతో నిరుద్యోగుల తరపున ఏఐఎస్బి రాష్ట్ర కార్యదర్శి పాపిరెడ్డి పల్లి పృథ్వీ డిమాండ్ చేస్తున్నారు. రోస్టర్ సరిచేయకుండానే నియామకాలు కొనసాగిస్తే భవిష్యత్‌లో కోర్టు కేసులు, నియామకాల రద్దు వంటి పరిణామాలు సంభవించే ప్రమాదం ఉందని బాధితులు హెచ్చరిస్తున్నారు. రోస్టర్ సరిచేయకుండానే నియామకాలు కొనసాగిస్తే భవిష్యత్‌లో నియామకాలు రద్దయ్యే పరిస్థితి వస్తే బాధ్యత ఎవరిది? అని వారు చెబుతున్నారు. వెంటనే కౌన్సిలింగ్ నిలిపివేసి, పాత ఉద్యోగుల ఆర్వోఆర్ సరిచేసి, పారదర్శకంగా నియామక ప్రక్రియ కొనసాగించాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఏఐఎస్బీ రాష్ట్ర కార్యదర్శి పాపిరెడ్డి పల్లి పృథ్వీ తదితర నేతలు పత్రికా విలేకరులు సమావేశంలో తెలిపారు. అర్హులైన నిరుద్యోగులకు న్యాయం చేయడమే మా లక్ష్యం అని అక్రమాలను బహిర్గతం చేసి అరికట్టే దిశగా అడుగులు వేస్తామన్నారు....




# ఇష్టంతో చదివితే మంచి ఫలితాలు వస్తాయి

## - వరుణ్ హై స్కూల్ వీడ్కోలు సభలో విద్యార్థులకు కరస్పాండెంట్ ఎలిచెర్ల వెంకటరమణారెడ్డి పిలుపు

**బ్రహ్మంగారిమఠం- సూర్య వాస్తవం:** విద్యార్థినీ, విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదివితే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో మంచి ఫలితాలు వస్తాయని వరుణ్ హై స్కూల్ కరస్పాండెంట్ ఎలిచెర్ల వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఉన్న వరుణ్ హై స్కూల్ ప్రాంగణంలో 10వ తరగతి విద్యార్థిని, విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థిని, విద్యార్థుల ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఫేర్వెల్ డే సభలో కరస్పాండెంట్ వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పెద్దలయెడ భక్తి భావాలతో విద్యార్థినీ, విద్యార్థులు మెలగాలని, మంచి క్రమశిక్షణను అలవర్చుకోవాలని, అప్పుడే వారి భవిష్యత్తు చక్కగా ఉంటుందని విద్యార్థినీ, విద్యార్థులకు పిలుపు నిచ్చారు. పదవ తరగతి చదువుతున్న విద్యార్థులందరూ కూడా ఒక ప్రణాళిక బద్ధంగా చదివినప్పుడే మనకు కావలసిన ఫలితాలు వస్తాయని ఆయన పేర్కొన్నారు. విద్యార్థినీ, విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులకు ఎప్పుడూ కూడా రాగద్వేషాలు ఉండవని, విద్యార్థులందరూ కూడా మంచిగా చదువుకొని పరీక్షలలో ఉన్నతశ్రేణిలో పాసై మంచి పేరు ప్రతిష్టలు తెచ్చుకోవాలి అనే ఉద్దేశ్యంతో చదువుల పట్ల శ్రద్ధతో విద్యార్థులను మందలిస్తారు కానీ వారి పైన కోపము గాని ద్వేషంతో గాని ఎప్పుడూ కూడా ఉపాధ్యాయులు చేయరని ఆయన పేర్కొన్నారు. అలాగే గత ఏడాది పదవ తరగతి నందు నూరు శాతం




ఫలితాలు సాధించడంతోపాటు 600 గాను 584 మార్కులు సాధించి మండలంలోని మొదటి స్థానాన్ని సాధించడంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన ప్రతిభ అవార్డుకు ఎంపికై జిల్లా సర్వోన్నతాధికారి చేతుల మీదుగా ప్రతిభా అవార్డు పత్రంతోపాటు 20వేల రూపాయల నగదును అందుకున్నామని, అదేవిధంగా మన వరుణ్ హై స్కూల్ ఏర్పాటు ముప్పై మూడు సంవత్సరాలు పూర్తయిందని, అప్పటినుండి మన పాఠశాలలో చదువుకున్న పదవ తరగతి విద్యార్థులు ఎందరో వివిధ రాష్ట్రాల తో పాటు పలు దేశాలలో స్థిరపడ్డారని ఆయన కొనియాడారు. అంతకుముందు ప్రధానోపాధ్యాయుడు డి ప్రణయ్ కుమార్ తో పాటు ఉపాధ్యాయులు రామయ్య ఓబుళపతి నాగార్జున రామచంద్రారెడ్డి బాలసుబ్బయ్య పీవీ కళ్యాణి సుభాషిని సౌజన్య రవికాంత్ రెడ్డి తదితరులు విద్యార్థిని విద్యార్థులను ఉద్దేశించి గత పది సంవత్సరాలుగా మా పాఠశాలలో చదువుకున్న విద్యార్థినీ విద్యార్థులు నేడు పరీక్షలు రాసి పాఠశాల నుంచి వెళుతున్నారంటే ఓ రకంగా బాధపడుతున్న ఉన్నత చదువులకు వెళుతున్నారని ఆనందం కూడా మరొకవైపు మాకు ఉందని మీరందరూ మనోధైర్యంతో ఇంతవరకు చదువుకున్న ప్రతి అంశాన్ని రాబోయే పబ్లిక్ పరీక్షలలో చక్కగా రాసి ఉన్నత ఫలితాలను సాధించాలని వారు తెలియజేశారు. అంతకుముందు పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులు మాట్లాడుతూ మేమెంతో కష్టపడి చదువుతున్నామని ఉపాధ్యాయుల పర్యవేక్షణలో వారు మాకు చెప్పిన అంశాలను క్షుణ్ణంగా చదువుకొని 600కు 590 కి పైగా మార్కులు సాధిస్తామని వారు ధీమా వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థిని, విద్యార్థులకు పాఠశాల కరస్పాండెంట్ ఎలిచెర్ల వెంకటరమణారెడ్డి చేతులమీదుగా పరీక్షకు కావలసిన పాడ్ ,పెన్ ,పెన్సిల్, రబ్బర్, స్కేల్ మొదలగు వస్తువులను వారికి పంపిణీ చేశారు. అనంతరం పాఠశాలలో ఉన్న మిగిలిన సహ విద్యార్థినీ, విద్యార్థులు అందరితో కలిసి ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు విందు భోజనాన్ని ఆరగించడం జరిగినది. అనంతరం విద్యార్థినీ, విద్యార్థులు ఆనంద డోలికలతో, సాంస్కృతిక కార్యక్రమాలలో అంగరంగ వైభవంగా పాల్గొని ఉరక లెక్కించారు.





# ఆధునిక సౌకర్యాలతోబ్యాంకింగ్ సేవలు అందించడమే ప్రధాన లక్ష్యం

## - తిరుపతి జోనల్ మేనేజర్ శ్రీనివాస్ కుమార్

**పులివెందుల - సూర్య వాస్తవం :** యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పులివెందుల శాఖలో పునరుద్ధరించిన (రెనోవేట్ చేసిన) ప్రాంగణాన్ని శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి తిరుపతి జోనల్ మేనేజర్ శ్రీపత్రి శ్రీనివాస్ కుమార్, కడప రీజినల్ మేనేజర్ ఎ. లక్ష్మీ తులసి, చీఫ్ మేనేజర్ అండ్ బ్రాంచ్ హెడ్ శ్రీ వెంకట్ కొమ్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జోనల్ మేనేజర్ మాట్లాడుతూ, పులివెందుల ప్రాంత ప్రజలకు ఆధునిక సౌకర్యాలతో కూడిన బ్యాంకింగ్ సేవలను అందించడం మా ప్రధాన లక్ష్యమని తెలిపారు. వినియోగదారులకు సౌకర్యవంతమైన వాతావరణంలో వేగవంతమైన, పారదర్శక మైన, నాణ్యమైన సేవలు అందించేందుకు ఈ పునరుద్ధరణ చేయబడిందని పేర్కొన్నారు. రీజినల్ మేనేజర్ ఎ.లక్ష్మీ తులసి మాట్లాడుతూ, డిజిటల్ బ్యాంకింగ్ సేవలను విస్తరించి, గ్రామీణ పట్టణ ప్రాంతాల మధ్య ఆర్థిక సేవలను మరింత బలోపేతం చేయడం కోసం బ్యాంక్ కృషి చేస్తోందని తెలిపారు. చీఫ్ మేనేజర్ అండ్ బ్రాంచ్ హెడ్ శ్రీ వెంకట్ కొమ్మ గారు మాట్లాడుతూ, ఖాతాదారుల నమ్మకమే మా బలం అని, కొత్త ప్రాంగణం ద్వారా మరింత మెరుగైన సేవలు అందించగలమని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది, ఖాతాదారులు, ప్రముఖులు పాల్గొన్నారు. కొత్త ప్రాంగణం ప్రారంభం కావడంతో ఖాతాదారులు హర్షం వ్యక్తం చేశారు.




PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )